

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

అంకినీడు లేని లోటు తీర్చలేనిది

- సీఎం చంద్రబాబు విచారం 3

- మంత్రి లోకేష్ సంతాపం 4

# ఏపీ గ్రోత్ ఇంజన్‌గా వీఈఆర్

## *నీతి ఆయోగ్‌తో సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు*



2

- ‘విశాఖ ఎకనమిక్ రీజియన్’ పరిధిలో 8 జిల్లాలు
- 2032 నాటికి 120 బిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం
- మూలపేట -కాకినాడ మధ్య బీచ్ రహదారి అభివృద్ధి
- మరో ముంబైలా విశాఖను తీర్చిదిద్దేలా ప్రణాళికల అమలు
- 20 లక్షల మందికి ‘వర్క్ ఫ్రమ్ హెూమ్’ కార్యాచరణ
- వివిధ ప్రాజెక్టుల కోసం లక్ష ఎకరాలు గుర్తించాలని ఆదేశం

# ఇకపై ఏటా డీఎస్సీ



- ఏడేళ్ల తర్వాత విజయవంతంగా మెగా డీఎస్సీ
- పకడ్బందీగా పరీక్షలు ప్రారంభించిన యంత్రాంగానికి అభినందనలు
- పారదర్శకంగా బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ
- మొదటి సారిగా 4 వేల మందికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి
- నూరుశాతం అక్షరాస్యతకై ప్రాజెక్ట్ అ - ఆ (అక్షర ఆంధ్ర)
- విద్యాశాఖ అధికారులతో సమీక్షలో మంత్రి నారా లోకేష్

4

# కేజీ డెల్టాకు తక్షణం జలాలు



- ❑ తుపాన్ల ముప్పు తప్పేలా పంటకాలం ముందుకు జరగాలి
- ❑ శాస్త్రీయంగా వాటర్ ఆడిటింగ్ -వాటర్ మేనేజ్‌మెంట్
- ❑ 365 రోజులూ పంటలతో రాష్ట్రం విరాజిల్లాలి
- ❑ జలవనరుల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ❑ బుడమేరులో పూడిక తొలిగించాలని అధికారులకు ఆదేశం
- ❑ పిజియోమీటర్లు, సెన్సార్లకు రూ.30 కోట్లు కేటాయింపు

3

## జమ్మూకశ్మీర్‌లో కొత్త పురోగతి యుగం మొదలైంది

- సీఎం చంద్రబాబు 3

# ఏఐలో యువతకు నైపుణ్య శిక్షణ

## ఎన్ విడియా సంస్థతో ప్రభుత్వం కీలక ఒప్పందం

- ◆ 10 వేల మంది విద్యార్థులకు శిక్షణ, 500 ఏఐ స్టార్టప్‌లకు లబ్ధి
- ◆ మంత్రి నారా లోకేష్ సమక్షంలో అవగాహన ఒప్పందం

5





## రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు

- మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- మేజర్ మల్లా రాంగోపాల్ నాయుడికి మంత్రి లోకేష్ అభినందనలు

6

## భగవత్ స్వరూపుడు ఎన్టీఆర్



- కొనియాడిన ఎన్టీఆర్ లిటరేచర్, గ్లోబల్ నెట్‌వర్క్ చైర్మన్ టీడీ జనార్ధన్

- న్యూజిలాండ్ రాజధాని అక్లాండ్‌లో వేడుకగా ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలు

7

# పేదల పెన్నిధి ఆర్డీటీ సేవలు ఆగవు..!



- విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేష్ అభయం
- కేంద్రంతో నిరంతర సంప్రదింపులు
- కొలిక్కివస్తున్న మంత్రి లోకేష్ ప్రయత్నాలు
- త్వరలో ఫలించే అవకాశం

6



# ఏపీ గ్రోత్ ఇంజన్‌గా వీఈఆర్

- ‘విశాఖ ఎకనమిక్ రీజియన్’ పరిధిలో 8 జిల్లాలు
- 2032 నాటికి 120 బిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం
- మూలపేట -కాకినాడ మధ్య బీచ్ రహదారి అభివృద్ధి
- మరో ముంబైలా విశాఖను తీర్చిదిద్దేలా ప్రణాళికల అమలు
- 20 లక్షల మందికి ‘వర్క్ ఫ్రమ్ హెూమ్’ కార్యాచరణ
- నీతి ఆయోగ్‌తో సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- వివిధ ప్రాజెక్టుల కోసం లక్ష ఎకరాలు గుర్తించాలని ఆదేశం







అమరావతి (చైతన్య రథం): ‘విశాఖ ఎకనమిక్ రీజియన్’ను ఆంధ్రప్రదేశ్‌కు గ్రోత్ ఇంజిన్‌గా తీర్చిదిద్దాలని... 2032 నాటికి 120 బిలియన్ డాలర్ల సంపద సృష్టి ఈ రీజియన్‌నుంచి జరగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. వచ్చే ఏడేళ్లలో విశాఖను మరో ముంబై నగరంలా తీర్చిదిద్దాలని నిర్దేశించారు. విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ పరిధిలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, ఏఎస్ఆర్, మన్యం.. మొత్తం 8 జిల్లాల పరిధిలో ఎకనమిక్ యాక్టివిటీ పెరిగేలా ప్రాజెక్టులు నెలకొల్పాలన్నారు. ఎనిమిది జిల్లాల్లో వివిధ ప్రాజెక్టుల కోసం లక్ష ఎకరాలు గుర్తించాలని అధికారులను ఆదేశించారు. 36 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం, 15.5 మిలియన్ జనాభా కలిగివున్న విశాఖ రీజియన్‌లో ప్రస్తుతం 49 బిలియన్ డాలర్ల జీడీపీ నమోదవుతోందని... 2032నాటికి 20నుంచి 24 లక్షల మేర ఉద్యోగాలు పెరిగేందుకు అవకాశం ఉండటంతో ఈ ప్రాంతం రాష్ట్ర పురోగతిలో కీలకం కానుందని సీఎం చంద్రబాబు నాయుడు వివరించారు.

### 7 గ్రోత్ డ్రైవర్లు గుర్తింపు:

శుక్రవారం సచివాలయంలో జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో ‘విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్’గా అభివృద్ధి చేసే అంశంపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. 6 పోర్టులు, 7 మాన్యుఫాక్చరింగ్ నోడ్లు, 17 మేజర్ వ్యవసాయ క్షేత్రాలు, 6 సర్వీస్ హబ్బులు, 12 పర్యాటక హబ్బులతో విశాఖ ఎకనమిక్ రీజియన్‌ను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. దీనిపై నీతి ఆయోగ్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పోర్టు, ఐటీ, వ్యవసాయం, పర్యాటకం, హెల్త్ కేర్, పట్టణీకరణ, మౌలికవసతుల కల్పన... ఇలా 7 గ్రోత్ డ్రైవర్లుగా రూపొందించిన ప్రణాళికలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇందుకోసం అత్యంత ప్రాధాన్యమైన 41 ప్రాజెక్టులను చేపట్టాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకొచ్చారు.

### సాకారమైతే ఫలితాలిలా..

విశాఖ ఎకనమిక్ రీజియన్ ప్రణాళికలు అమలు చేయగలిగితే వచ్చే ఏడేళ్లలో 7.5 లక్షల గృహాలు, 10వేల హోటల్ రూములు, 20వరకు ఇన్నోవేషన్ సెంటర్లు, 10 కాలేజీలు, 7వేల ఆస్పత్రి బెడ్లు, 20వేల హెక్టార్ల పరిధిలో పరిశ్రమలు, 80 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యాలయ సముదాయం, 60 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో గోదాములు అదనంగా సమకూరతాయని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

### సముద్ర తీరం -సంపద నిలయం

మూలపేట- విశాఖపట్నం, విశాఖపట్నం- కాకినాడ మధ్య బీచ్ రహదారులు నిర్మించి.. వాటిని జాతీయ రహదారులతో అనుసంధానిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సముద్ర తీరం సంపద నిలయమని, దానిని మరింత వినియోగించుకునేలా చూడాలని అధికారులకు సూచించారు. ‘పర్యాటకాన్ని పరిశ్రమగా గుర్తించాం, నూతన పాలసీ పెట్టుబడిదారులకు ఎంతో అనుకూలం. భవిష్యత్ అవసరాల దృష్ట్యా యువతకు నిరంతరాయంగా నైపుణ్య శిక్షణ అందిస్తాం. వర్క్ ఫ్రమ్ హెూమ్ - నాలెడ్జ్ ఎకానమి అవుట్ సోర్సింగ్ విధానాలు అవలంభిస్తున్నాం. వర్క్ ఫ్రమ్ హెూమ్ కింద 20 లక్షలమందికి అవకాశం కల్పించాలని ప్రయత్నిస్తున్నాం’ అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

### సమీక్షలో చర్చించిన మరికొన్ని అంశాలు

దేశంలోని టాప్ 3 స్టీల్ పరిశ్రమలతో స్టీల్ హబ్‌గా తీర్చిదిద్దడం... అలాగే పెట్రో కెమికల్స్, గ్యాస్ గ్రిడ్, పోర్టుల అభివృద్ధి, పెట్రోకెమికల్స్- మెడికల్ టెక్, షిప్ బిల్డింగ్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, క్లీన్ టెక్, లేబర్ ఇంటెన్సివ్ మాన్యుఫాక్చరింగ్‌పై దృష్టి పెట్టాలని నిర్ణయం.

వచ్చే ఏడేళ్లలో ఐటీ రంగంలో కనీసం 4నుంచి 5 లక్షల ఉద్యోగాల కల్పన జరిగేలా లక్ష్యం. డేటా సెంటర్లు, స్టార్టప్‌లు-ఇన్నోవేషన్ సెంటర్లు ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వడం.

ప్రస్తుతం కొనసాగుతున్న 4 రైల్వే ప్రాజెక్టులతోపాటు అదనంగా 2032కల్లా మరో 7 కొత్త రైల్వే ప్రాజెక్టులు పూర్తిచేయడం.

మాన్యుఫాక్చరింగ్ నోడ్స్, పోర్టులకు అనుకూలించేలా కొత్తగా 9రోడ్డు ప్రాజెక్టులు చేపట్టడం.

### 2028-30కల్లా 77 కి.మీ.మేర నిర్మించే వైజాగ్ మెట్రో ప్రాజెక్టుపైనా సమీక్షలో చర్చించారు.

ఏపీ విద్యుత్ సంస్కరణలు దేశానికే ఆదర్శం

‘1998లో విద్యుత్ సంస్కరణలు దేశంలోనే తొలిసారిగా తీసుకువచ్చాం. 2014లో రెన్యూవబుల్ ఎనర్జీకి ప్రాధాన్యతనిచ్చాం. ఇప్పుడు అదే అత్యంత చవకైన విద్యుదుత్పత్తికి అవకాశం కల్పించింది. టెక్నాలజీ పరిధి పెరిగింది. దీనిని విద్యుత్ రంగంలో వినియోగించి అద్భుతాలు సాధించాం. ఇప్పుడు ప్రజలే ఉత్పత్తిదారులు- వినియోగదారులను చేసేలా నూతన విధానాలు అమలు చేస్తున్నాం. ఎవరి విద్యుత్ వాళ్లే ఉత్పత్తి చేసుకుంటే విద్యుత్ సరఫరా నష్టాలు అనేవి ఉండవు. ఈవీ వాహనాలకు అందరూ మళ్లితే రవాణా ఖర్చులు కూడా పూర్తిగా తగ్గిపోతాయి. సోలార్, విండ్ పవర్‌తోపాటు పంప్డ్ ఎనర్జీ, బ్యాటరీ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి ప్రాధాన్యతనిస్తున్నాం. ఇందుకుతగ్గ వనరులు రాష్ట్రంలో పుష్కలంగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ఆశయం నెరవేరేందుకు నీతి ఆయోగ్ సహకారం కూడా కోరుతున్నాను’ అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

### విద్యుదుత్పత్తి సామర్థ్యం పెంచేలా ప్రణాళికలు

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ ట్రాన్సిషన్ రోడ్ మ్యాప్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం -నీతి ఆయోగ్, ఐఎస్ఈజీ ఫౌండేషన్ మధ్య ముఖ్యమంత్రి సమక్షంలో అవగాహనా ఒప్పందం కుదిరింది.

ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుదుత్పత్తి సామర్థ్యం 27.3 గిగావాట్లుగా ఉంది.

రాష్ట్రంలో 2019లో 55.6 బిలియన్ యూనిట్లుగా ఉన్న విద్యుత్ డిమాండ్ 2025నాటికి 69.7 బిలియన్ యూనిట్లకు చేరింది. ఇందులో పరిశ్రమరంగంలో 4.8 శాతం, గృహ వినియోగానికి 5.1 శాతం మేర డిమాండ్ పెరిగింది.

వచ్చే ఏడాదికి రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 88.6 బిలియన్ యూనిట్లనుంచి 2035నాటికి 163.9 బిలియన్ యూనిట్లకు చేరుకోనుంది.

ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ కింద 2029నాటికి 78.50 గిగావాట్ల సోలార్ విద్యుత్, 35 గిగావాట్ల విండ్, పంప్డ్ స్టోరేజ్ 22 గిగావాట్లు, గ్రీన్ హైడ్రోజన్ 1.50ఎంఎంపీటీఏ, బ్యాటరీ స్టోరేజ్ 25 గిగావాట్లు, ఇథనాల్ 1,500, కెఎల్‌పీడీ, 5,000, ఈవీ చార్జింగ్ స్టేషన్లు, 10,000 టీపీడీ బయో సీఎన్జీ-సీబీజీ లక్ష్యం.

క్లీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్రానికి ఇప్పటిదాకా రూ.5.78 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. దీంతో 57.7 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కానుంది. సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యం, సీఎస్ విజయానంద్, ఐఎస్ఈజీ ఫౌండేషన్ ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేజీ డెల్టాకు తక్షణం జలాలు

- తుపాన్ల ముప్పు తప్పేలా పంటకాలం ముందుకు జరగాలి
- శాస్త్రీయంగా వాటర్ ఆడిటింగ్ -వాటర్ మేనేజ్‌మెంట్
- 365 రోజులూ పంటలతో రాష్ట్రం విరాజిల్లాలి
- జలవనరుల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- బుడమేరులో పూడిక తొలిగించాలని అధికారులకు ఆదేశం
- పిజియో మీటర్లు, సెన్సార్లకు రూ.30 కోట్లు కేటాయింపు



అమరావతి (చైతన్య రథం): కృష్ణా, గోదావరి డెల్టాలో పంటల సాగు వెంటనే చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. తుఫాన్లకంటే ముందుగానే పంటలు చేతికొచ్చేలా పంటల సాగు కాలంలో మార్పులు తీసుకురావాలని సూచన చేశారు. భూగర్భ జలాలు పెంచడం, రిజర్వాయర్లు నింపడం, జలవనరుల సమర్ధ వినియోగం.. ఈ 3అంశాలపై అధికారులు ప్రధానంగా దృష్టి పెట్టాలని సూచించారు. 365 రోజులు భూమి పచ్చగా ఉండేలా... 3 పంటలు నిరంతరం పండించేలా చూడాలన్నారు. భూగర్భ జలాల వివరాలు తెలుసుకునేందుకు ఉపయోగించే పిజియో మీటర్లు, ఇంకా ఏడబ్ల్యుఎస్ సెన్సార్లు రాష్ట్రంలో కొన్నిచోట్ల పనిచేయకపోవడంపై ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణం నూతన పరికరాలు కొనుగోలు చేసేందుకు రూ.30 కోట్లు విడుదల చేయాలని ఆదేశాలిచ్చారు. నిర్వహణా లోపాలు సరిచేసుకుని వాటర్ ఆడిట్ శాస్త్రీయంగా చేపట్టాలని చెప్పారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర సహా రాష్ట్రంలో నిర్మించాల్సిన అన్ని ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

**భూగర్భ జలాల వివరాలతో బులిటెన్లు**

శుక్రవారం సచివాలయంలో జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి 'జలవనరుల లభ్యతను బట్టి నీటి సమర్ధ వినియోగం జరగాలన్నారు. భూగర్భ జలాలు 20 మీటర్లకన్నా తక్కువ ఉన్న మండలాలు, 8-20 మీటర్ల మధ్య భూగర్భ జలాలున్న మండలాల వివరాలు అందించాలి. బేసిన్లు, జిల్లాలవారీగా, సెంట్రల్- లోకల్ బులిటెన్లు రిలీజ్ చేయాలి. రాష్ట్రంలో సగటు భూగర్భ జలాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలి. సీలేరు నీరు కృష్ణా డెల్టాకు వినియోగించే అంశాన్ని పరిశీలించాలి. హంద్రీ-నీవా మెయిన్ కెనాల్ విస్తరణ పనుల్లో వేగం పెంచాలి. వెలిగొండ స్టేజ్ 1 పనులు 2026 జూన్‌కల్లా పూర్తి కావాలి. కేంద్ర ఆర్థిక సాయం కోసం సాస్కిలో పెట్టండి. శ్రీశైలం ప్రాజెక్టు ప్లంజ్ పూల్ మరమ్మతులకు తక్షణ చర్యలు చేపట్టండి. బుడమేరు ప్రవాహానికి అడ్డంకులు లేకుండా పూడికతీత, ముళ్ల కంపలు తొలిగించండి. ఒక్క ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసినా... ఆ నీటితో 3, 4 ఏళ్లు కరువొచ్చినా వాటర్ మేనేజ్మెంట్ జరగాలి. క్రాప్ ప్యాట్రన్ మార్చి... తడి-ఆరుతడి పంటల సాగుకు యాక్షన్ ప్లాన్ రూపొందించండి. జల సంరక్షణ కోసం వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు నిర్మించాలి' అని చంద్రబాబు పేర్కొన్నారు.

**పోలవరం-బనకచర్లకు త్వరలో టెండర్లు**

పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి అటవీ-పర్యావరణ అనుమతులు, డీపీఆర్ ఆమోదం తదితరాలు అన్నీ అనుకున్న సమయానికల్లా జరగాలని, భూసేకరణకు కూడా సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. హైబ్రీడ్ యాన్యుటీ విధానంలో పోలవరం-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టును చేపట్టాలని చెప్పారు. అలాగే, టెండర్లకు సంబంధించిన రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీతో డ్రాఫ్ట్ డాక్యుమెంట్ రూపొందించడం, సాంకేతిక నిపుణల పర్యవేక్షణ అనంతరం టెండర్లు పిలవడం ఈ నెలాఖరుకల్లా పూర్తికావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

**బనకచర్లకు రుణ సమీకరణ ఇలా..**

జలహారతి కార్పొరేషన్ కింద పోలవరం- బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు నిర్మాణం చేపడుతుండగా, దీనికోసం స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) ఇప్పటికే ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు నిర్మాణానికి ఆర్థిక వనరుల సమీకరణ కోసం కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం ప్రతిపాదనలు పంపించింది. మొత్తం ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే రూ. 81,900 కోట్ల వ్యయంలో 50శాతం అంటే రూ. 40,950 ఈఏపీ రుణంగా పొందాలని నిర్ణయించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ గ్రాంట్‌గా 20 శాతం నిధులు రూ. 16,380 కోట్లు సమకూర్చుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వ ఈక్విటీగా 10శాతం నిధులు రూ. 8,190 కోట్లు, హ్యామ్ విధానంలో మరో 20శాతం నిధులు రూ. 16,380కోట్లు ఖర్చు చేయనున్నారు.

**ఈ ఏడాది చివరికల్లా డయాఫ్రమ్ వాల్ :**

మరోవైపు పోలవరం ప్రాజెక్టు సివిల్ నిర్మాణం పనులు ఇప్పటివరకు 81.70 శాతం పూర్తయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో కేవలం 3.84 శాతం పనులు మాత్రమే చేయగా, 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలల కాలంలో 5.93 శాతం పనులు జరగడం విశేషం. డయాఫ్రమ్ వాల్ 64 శాతం, బట్రెస్ డ్యామ్ 91శాతం, ఇసుక గట్టి పరిచే వైబ్రో కంప్రాక్షన్ పనులు 54 శాతం పూర్తయ్యాయి. ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికల్లా డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తికానుంది. మరోవైపు, పోలవరం ప్రాజెక్టు పనులు అనుకున్న సమయానికి పూర్తయ్యేలా కాంట్రాక్టర్లతో చర్చించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. సమీక్ష సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు, జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, పంచాయితీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్, సీఎం కార్యదర్శి రాజమౌళి, ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, సీసీ ఎల్ ఏ జయలక్ష్మి హాజరయ్యారు.

## జమ్మూకశ్మీర్‌లో కొత్త పురోగతి యుగం

# మొదలైంది: సీఎం చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): ప్రధాని మోదీ నాయకత్వంలో జమ్మూకశ్మీర్‌లో కొత్త పురోగతి యుగం ప్రారంభమైందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. సవాళ్లతో కూడిన భూభాగంలో రెండు కీలక ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేసి దేశానికి అంకితం చేసిన ప్రధాని నరేంద్రమోదీని అభినందించారు.

ఈమేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ.. 'చినాబ్ బ్రిడ్జ్.. ప్రపంచంలోనే ఎత్తయిన రైలు ఆర్చ్ వంతెన కాగా.. దేశంలోనే మొట్టమొదటిసారిగా తీగలతో అనుసంధానించిన అంజీ రైల్వే వంతెనను నిర్మించడం దేశానికి గర్వకారణం. ఉధంపూర్- శ్రీనగర్- బారాముల్లా రైలు లింక్ ఆధ్యాత్మిక పర్యాటకాన్ని మెరుగుపరుస్తుందని, జీవనోపాధి అవకాశాలను సృష్టిస్తుందని విశ్వసిస్తున్నాను.

వందేభారత్ రైళ్ల ద్వారా అన్ని వాతావరణ పరిస్థితుల్లో మాతా వైష్ణోదేవి కొలువైన కట్రానుంచి శ్రీనగర్ వరకు రైలు కనెక్టివిటీ అందుబాటులో ఉండటం సంతోషకరమైన విషయం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# అంకినీడు లేని లోటు తీర్చలేనిది

## - సీఎం చంద్రబాబు విచారం

అమరావతి (చైతన్య రథం): చల్లపల్లి రాజా తనయుడు, మచిలీపట్నం పార్లమెంట్ మాజీ సభ్యులు శ్రీమంతురాజా యార్లగడ్డ అంకినీడు ప్రసాద్ బహద్దూర్ మరణంపట్ల సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. ఈమేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ.. 'జమీందారులుగానే కాకుండా రాజకీయాల ద్వారా కూడా ప్రజలకు సేవచేసిన అంకినీడు ప్రసాద్... చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల అనువంశిక ధర్మకర్తలలో ఒకరిగా ప్రముఖ ప్రాచీన దేవాలయాల అభివృద్ధికి, నిర్వహణకు కృషి చేశారు.

తాను స్థాపించిన విద్యాలయం ద్వారా వేలాదిమంది పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారు. ఎంతోమందికి సాయం చేసి, మానవతావాదిగా, సౌమ్యుడిగా ప్రజల ప్రేమాభిమానాలు పొందారు.

అలాంటి దాత మరణం విచారకరం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ... అంకినీడు ప్రసాద్ కుటుంబీకులకు సానుభూతి తెలియజేస్తున్నా'ను అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## కేంద్రానికి కృతజ్ఞతలు: చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): విశాఖపట్నం సౌత్ కోస్ట్ రైల్వే జోన్ దార్శనికతను ముందుకు తీసుకెళ్లడం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర ప్రభుత్వానికి సీఎం చంద్రబాబు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ.. విశాఖపట్నంలోని సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్‌గా నియమితులైన సందీప్ మాథుర్‌కు అభినందనలు తెలిపారు. ఆయన కొత్త పదవిలో ఫలవంతమైన పదవీకాలం ఉండాలని ఆకాంక్షించారు. వివిధ అంశాలపై ఎక్స్‌లో పోస్టులు పెట్టిన సీఎం చంద్రబాబు.. శతాధిక చిత్రాలకు నిర్మాతగా, తెలుగు సినీరంగానికి ఎనలేని సేవలందించిన డి రామానాయుడు జయంతి సందర్భంగా ఆయన స్మృతికి నివాళి అర్పించారు. అలాగే, 2025 ఏపీ డీఎస్సీ ఉపాధ్యాయ నియామక పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త, నవత ట్రాన్స్‌పోర్టు వ్యవస్థాపకులు పర్వతనేని కోటేశ్వరరావు మృతిపట్ల సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. 1982లో మొట్టమొదటిసారిగా దేశంలోనే నాణ్యమైన రవాణా సేవలకు శ్రీకారంచుట్టి 9 రాష్ట్రాలకు సంస్థ కార్యకలాపాలను విస్తరింపచేసిన కోటేశ్వరరావు వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి మార్గం చూపించారన్నారు. ఆయన మృతి రవాణా రంగానికి తీరని లోటుగా అభివర్ణిస్తూ.. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

## ఏడేళ్ల తర్వాత

# విజయవంతంగా మెగా డీఎస్సీ!

- పకడ్బందీగా పరీక్ష ప్రారంభించిన యంత్రాంగానికి అభినందనలు
- ఇకపై ప్రతిఏటా డీఎస్సీ నిర్వహించి టీచర్ పోస్టులు భర్తీ
- పారదర్శకంగా బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ కూడా ప్రారంభించాం
- మొదటి సారిగా 4 వేల మందికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి
- నూరుశాతం అక్షరాస్యతకై ప్రాజెక్ట్ అ - ఆ (అక్షర ఆంధ్ర)
- విద్యాశాఖ అధికారులతో సమీక్షలో మంత్రి నారా లోకేష్



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ చరిత్రలో తొలిసారిగా అత్యధికంగా 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ చేపట్టామని, ఇది సువర్ణాక్షరాలతో లిఖించదగిన అధ్యాయమని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. ఉండవల్లి నివాసంలో పాఠశాల, ఇంటర్మీడియట్, ఉన్నత విద్య, వయోజన విద్య, సమగ్రశిక్ష ఉన్నతాధికారులతో శుక్రవారం 4 గంటలకు పైగా సుదీర్ఘంగా వివిధ అంశాలపై మంత్రి లోకేష్ సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఎటువంటి సమస్యలు తలెత్తకుండా డీఎస్సీ పరీక్ష ప్రక్రియను ప్రారంభించిన అధికారులను అభినందించారు. డీఎస్సీ పరీక్షకు తొలిరోజు ఉదయం 88శాతం, సాయంత్రం సెషన్‌లో 86శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు తెలిపారు. అకడమిక్ క్యాలెండర్, లీప్ యాప్ కూడా సిద్ధం చేశామని చెప్పారు. ఇకపై ప్రతిఏటా డీఎస్సీ నిర్వహణ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేసి విద్యాప్రమాణాలను మెరుగుపరుస్తామని మంత్రి లోకేష్ చెప్పారు. అంతిమంగా రాబోయే నాలుగేళ్లలో ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ తేవడమే తమ లక్ష్యమని అన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియను కూడా విజయవంతంగా ప్రారంభించామని తెలిపారు. 27వేల మందికిపైగా స్కూల్ అసిస్టెంట్ల బదిలీలను ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా చేపట్టాం. ఇదివరకెన్నడూ లేనివిధంగా 4వేల మందికి పైగా టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు కూడా ఇస్తున్నామని తెలిపారు. ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా టీచర్ ట్రాన్స్‌ఫర్ యాక్ట్ మేరకు పూర్తి పారదర్శకంగా బదిలీలు, ప్రమోషన్లు ఇస్తున్నట్లు మంత్రి లోకేష్ చెప్పారు.

రాష్ట్రంలో నూరుశాతం అక్షరాస్యత సాధనే లక్ష్యంగా అక్షర ఆంధ్ర పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు మంత్రి లోకేష్ చెప్పారు. రాష్ట్రంలో 15 - 59 సంవత్సరాల వయస్సు గలవారిలో ఇప్పటికీ 81లక్షల మంది నిరక్షరాస్యులుగా ఉండటంపై మంత్రి విస్మయం వ్యక్తం చేశారు. భారదేశంలోనే వయోజన విద్యలో ఆంధ్రప్రదేశ్ అట్టడుగున ఉన్న నేపథ్యంలో ఇకపై మిషన్ మోడ్‌లో వయోజన విద్యా కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఉల్లాస్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ ఏడాది మార్చిలో 3.95లక్షల మందికి అక్షరాస్యత పరీక్షలు నిర్వహించగా, 3.53 లక్షలమంది (90.12%) మంది పాసయ్యారని తెలిపారు. వయోజన విద్యా విభాగంలో 247 పోస్టులకుగాను 109 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ కృతికా శుక్లా మంత్రి దృష్టికి తేగా, నూరుశాతం లక్ష్యాన్ని సాధించగలిగే అంకితభావం కలిగిన వారిని మాత్రమే పాఠశాల విద్యాశాఖ నుంచి తీసుకోవాలని సూచించారు. రాబోయే మూడేళ్లలో అక్షరాస్యతలో టాప్-3 రాష్ట్రాల్లో ఒకటిగా ఆంధ్రప్రదేశ్ ఉండాలని, ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

### నైపుణ్యం యాప్‌ను అప్‌గ్రేడ్ చేయాలి

సప్లయ్ - డిమాండ్‌కు అనుగుణంగా స్కిల్లింగ్ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటుచేయాలని, నైపుణ్యం యాప్‌ను అప్‌గ్రేడ్ చేయాలని స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులకు మంత్రి లోకేష్ సూచించారు. నైపుణ్యం పోర్టల్‌లో అభ్యర్థుల నమోదు, శిక్షణ, సామర్థ్య పరీక్ష, సర్టిఫికేషన్, ఉద్యోగ కల్పన, పరిశ్రమల అనుసంధానం, పరిశ్రమల్లో ఖాళీల వివరాలు మొదలైన వాటిని పొందుపర్చాలని అన్నారు. సెక్టార్ వైజ్ ప్లేస్‌మెంట్స్, జాబ్ మేళాల వివరాలను కూడా ఇందులో పొందుపర్చాలన్నారు. నైపుణ్యం యాప్ ద్వారా ఈ ఏడాది 6,83,052 మంది దరఖాస్తు చేసుకోగా, 6,45,163 మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చామని, వారిలో 77,703 మందికి ఉద్యోగాలు లభించాయని ఎపిఎస్ఎస్డిసి సిఇఓ గణేష్ కుమార్ తెలిపారు.

### త్వరలో ఆటిజం సెంటర్లు

రాష్ట్రానికి మంజూరైన 125 ఆటిజం సెంటర్లను వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి లోకేష్ ఆదేశించారు. ఆటిజంతో బాధపడుతున్న వారి తల్లిదండ్రులకు ఊరట కలిగించేలా ఈ సెంటర్లలో నిపుణులను ఎంపిక చెయ్యాలని ఆదేశించారు. ఆటిజంపై ఏర్పాటు చేసిన ప్రజా ప్రతినిధుల కమిటీ సలహాలు తీసుకోవాలని సూచించారు. అన్ని త్వరితగతిన విద్యార్థులకు స్కూల్ కిట్స్ అందేలా చూడాలని సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాస్‌ను ఆదేశించారు.

### కాలేజీ స్థాయిలోనే నైపుణ్య శిక్షణ

ఉన్నత విద్యపై మంత్రి నారా లోకేష్ సమీక్షిస్తూ... యూనివర్సిటీల నుంచి విద్యార్థులు బయటకు వచ్చేటప్పటికే సరైన నైపుణ్య శిక్షణ పొంది ఉద్యోగం సాధించే దశకు చేరుకునేలా ఉండాలన్నారు. ఇందుకు అవసరమైన నైపుణ్యశిక్షణ కార్యక్రమాలను కాలేజ్ స్థాయిలోనే పెద్దఎత్తున చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వివిధ యూనివర్సిటీల వీసీ పదవులకు సెర్చ్ కమిటీల ద్వారా సాధ్యమైనంత త్వరగా పేర్లు సూచించాలని ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తిని కోరారు. చైర్మన్ స్పందిస్తూ... ఈ నెలాఖరులోగా ఆయా వర్సిటీలకు సెర్చ్ కమిటీ సిఫారసులను పంపిస్తామని తెలియజేసారు. వివిధ యూనివర్సిటీల చట్టాలను సమీక్షించి అతి త్వరలో ఏకీకృత చట్టాన్ని తీసుకురావాలని మంత్రి సూచించారు.

ఇందులో గవర్నింగ్ బోర్డ్, ఎగ్జిక్యూటివ్ కమిటీ, అకడమిక్ కౌన్సిల్, తదితర విభాగాలు ఉంటాయని మంత్రికి మధుమూర్తి వివరించారు. ఎప్ సెట్, లా సెట్, పిజి సెట్ వంటి ప్రవేశ పరీక్షలను నిర్ణీత క్యాలెండర్ ప్రకారం నిర్వహిస్తున్నామని, అకడమిక్ క్యాలెండర్ ప్రకారం కాలేజీలు ప్రారంభం అవుతాయని తెలియజేసారు. విద్యార్థుల నమోదుకై అపార్ ఐడి 98శాతం పూర్తిచేశామని, త్వరలో నూరుశాతం పూర్తిచేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఐఎస్‌బి, ట్రిపుల్ ఐటి, ఇంగ్లీషు అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ), సౌత్ ఏషియన్ యూనివర్సిటీ, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ అండ్ రీసెర్చ్ (నైపర్) ఏర్పాటుపై సమావేశంలో చర్చించారు.

రాష్ట్రంలో ఫారిన్ యూనివర్సిటీలు, ప్రైవేటు యూనివర్సిటీలకు అనుమతులపై మంత్రి సమీక్షించారు. ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటుకు అడ్డంకిగా ఉన్న జాయింట్ సిర్టిఫికేషన్ ఆఫ్ డిగ్రీస్ (జేసిడి) నిబంధనలను సడలించే అంశం పై చర్చించారు. నాణ్యత పై ఎటువంటి రాజీ లేకుండా ప్రైవేట్ కాలేజీలకు ఇచ్చే ఎన్‌ఓసి లు మరింత సులభతరంగా అందజేయాలని ఆదేశించారు. అలాగే కనిగిరి త్రిపుల్ ఐటి ఏర్పాటు పై సమీక్షించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు, ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ కృతికా శుక్లా, కళాశాల విద్య డైరెక్టర్ నారాయణ్ భరత్ గుప్తా, ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తి, ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సిఇఓ గణేష్ కుమార్, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరక్టర్ బి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ రాజశేఖర్ బాధ్యతల స్వీకరణ



విజయవాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ విద్యా సంక్షేమ మౌలిక సదుపాయాల కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) చైర్మన్‌గా నియమితులైన ఎస్ రాజశేఖర్ సంస్థ ప్రధాన కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మాజీమంత్రి, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జవహర్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, ఎండి షరీఫ్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్లు హాజరయ్యారు.

## అంకినీడు ప్రసాద్ మృతి తీరనిలోటు

*- మంత్రి లోకేష్ సంతాపం*



అమరావతి (చైతన్యరథం): చల్లపల్లి రాజా కుమారుడు, మచిలీపట్నం మాజీ ఎంపీ శ్రీమంతు రాజా యార్లగడ్డ అంకినీడు ప్రసాద్ బహద్దూర్ మృతిపట్ల విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. విద్య, రాజకీయ, సామాజిక రంగాల్లో అంకినీడు ప్రసాద్ విశేష సేవలు అందించారన్నారు. చల్లపల్లిలోని ఎస్సార్ వైఎస్సీ జూనియర్ కళాశాల కరస్పాడెంట్‌గా పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషిచేశారు. జమిందారు వ్యవస్థలో ప్రజలకు అన్ని విధాలా అండగా నిలిచిన చరిత్ర చల్లపల్లి జమిందారు వంశీయుల సొంతం. మోపిదేవి, శ్రీకాకుళం, పెదకళ్లేపల్లి, యార్లగడ్డ, శివగంగ ప్రాంతాల్లో దేవాలయాల అభివృద్ధికి విశేష కృషి చేశారు. ఆయన మరణం చల్లపల్లి ప్రాంతానికి తీరనిలోటు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. ఆయన కుటుంబ సభ్యులకు మంత్రి లోకేష్ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఏఐలో యువతకు నైపుణ్య శిక్షణ

- ఎన్ విడియా సంస్థతో ప్రభుత్వం కీలక ఒప్పందం



- 10 వేల మంది విద్యార్థులకు శిక్షణ, 500 ఏఐ స్టార్టప్‌లకు లబ్ధి
- మంత్రి నారా లోకేష్ సమక్షంలో అవగాహన ఒప్పందం




ఉండవల్లి (చైతన్యరథం): ఏఐ ఆధారిత పరిశోధనలు, నవీన ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధిలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగ్రామిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) యూనివర్సిటీ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఏఐలో యువతకు నైపుణ్య శిక్షణ సహా ఏఐ యూనివర్సిటీ ఏర్పాటుకు సహకరించేలా ప్రపంచ ప్రఖ్యాత ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) కంప్యూటింగ్ సంస్థ ఎన్ విడియా (NVIDIA)తో రాష్ట్ర ప్రభుత్వం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఉన్నత విద్య అధికారులు, ఎన్ విడియా (NVIDIA) ప్రతినిధులు శుక్రవారం అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా 10వేల మంది విద్యార్థులకు ఏఐలో నైపుణ్య శిక్షణ అందించనున్నారు. దీంతో పాటు 500 ఏఐ ఆధారిత స్టార్టప్‌ల అభివృద్ధికి మద్దతు ఇవ్వనున్నారు. గతేడాది అక్టోబర్‌లో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్.. ఎన్ విడియా సీఈవో జెన్సన్ హువాంగ్‌తో ముంబైలో సమావేశం అయ్యారు. అమరావతిలో ఏర్పాటు చేయబోయే ఏఐ యూనివర్సిటీకి సహకరించాల్సిందిగా కోరారు. ఇందుకు హువాంగ్ సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో ఎన్ విడియాతో ప్రభుత్వం కీలక ఒప్పందం కుదుర్చుకుంది.

## ఆంధ్రప్రదేశ్‌ను ఏఐ పరిశోధనల కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రముఖ ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యాలతో రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులకు ఆధునిక ఏఐ నైపుణ్యాలను అందించనున్నారు. రాబోయే సంవత్సరాల్లో 10 వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం, 500 ఏఐ ఆధారిత స్టార్టప్‌ల అభివృద్ధికి మద్దతు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏఐ యూనివర్శిటీకి అత్యాధునిక కంప్యూటింగ్ వనరులు, సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫామ్‌లు, హార్డ్‌వేర్ సామర్థ్యాలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. పరిశ్రమలు, ప్రభుత్వం, విద్యా రంగం మధ్య బలమైన భాగస్వామ్యానికి ఈ ఒప్పందం వేదికగా మారనుంది. విద్యార్థులకు ప్రాజెక్ట్‌లు, పరిశోధన, మార్కెట్ అవకాశాలు, మెంటార్‌షిప్ వంటి అనేక అవకాశాలను కల్పించనున్నారు. ముఖ్యంగా ఏఐ, స్టార్టప్‌ల అభివృద్ధికి ఇది బలమైన వేదికగా నిలవనుంది. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అడ్వాన్స్‌డ్ ఏఐ రీసెర్చ్ హబ్‌గా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఈ ఒప్పందం కీలకమైన ముందడుగు కానుంది.

ఈ కార్యక్రమంలో ఎన్ విడియా (NVIDIA) సౌత్ ఏసియా ఎండీ విశాల్ దూపర్, స్ట్రాటజిక్ బిజినెస్ డైరెక్టర్ గణేష్ మహబాల, ఏవీపీ ప్రైమస్ పార్ట్‌నర్ సుమన్ కసానా, విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, ఏపీఎస్‌హెచ్‌ఈ ఛైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.









## ప్రభుత్వ పాఠశాలలకు అందించే వివిధ రకాల కిట్లను.. పరిశీలించిన మంత్రి లోకేష్



ఉండవల్లి (చైతన్యరథం): వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలకు అందించే వివిధ రకాల కిట్లను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరిశీలించారు. ఈ మేరకు ఉండవల్లి నివాసంలో ప్రభుత్వం అందించబోయే కిట్లను అధికారులు శుక్రవారం ప్రదర్శించారు. ఆయా కిట్లను పరిశీలించిన మంత్రి లోకేష్ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని 222 పీఎమ్ శ్రీ పాఠశాలలకు స్టెమ్ ల్యాబ్ కిట్లను అందించనున్నారు. ఒక్కో స్టెమ్ ల్యాబ్ కిట్ లో 335 ఐటెమ్స్ ఉండనున్నాయి. రీసెర్చ్, కాన్సెప్ట్ ఓరియెంటెడ్‌గా వీటిని రూపొందించారు. విద్యార్థులకు సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితం (స్టెమ్) అంశాలలో ప్రాక్టికల్ నాలెడ్జ్, నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ఇది దోహదపడనున్నాయి. వీటితో పాటు ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, సెకెండరీ స్కూల్స్‌కు అందించే లైబ్రరీ బుక్స్ ను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి రూపొందించిన జాదు పిటారా కిట్, ఎఫ్ఎల్ఎన్ ప్రింట్ రిచ్ మెటీరియల్స్, గ్రేడ్ 1,2 విద్యార్థుల కోసం రూపొందించిన ఎఫ్ఎల్ఎన్ హ్యాండ్ మేడ్ మెటీరియల్స్‌ను పరిశీలించారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా రామవరప్పాడు ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న ఎమ్.మస్తాన్ రావు, విజయవాడ పటమట ఎంపీయూపీ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్న ఓ.నిహారిక గీసిన డ్రాయింగ్స్‌ను మంత్రి లోకేష్ కు సిబ్బంది బహూకరించారు.







# రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు

- మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలి
- మేజర్ మల్లా రాంగోపాల్ నాయుడికి మంత్రి లోకేష్ అభినందనలు
- మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన కీర్తిచక్ర అవార్డు గ్రహీత రాంగోపాల్ నాయుడు

ఉండవల్లి (చైతన్యరథం): దేశంలోనే ప్రతిష్టాత్మక కీర్తిచక్ర అవార్డు పొందిన ఆర్మీ మేజర్ మల్లా రాంగోపాల్ నాయుడు కుటుంబ సభ్యులతో సహా ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం నగిరిపెంటకు చెందిన మల్లా రాంగోపాల్ నాయుడు మరాఠా లైట్ ఇన్ ఫాంట్రీ, 56వ బెటాలియన్, రాష్ట్రీయ రైఫిల్స్ మేజర్‌గా పనిచేస్తుండగా.. జమ్ముకశ్మీర్ లోని నియంత్రణ రేఖ వద్ద దేశం కోసం ప్రాణాలకు తెగించి నలుగురు ఉగ్రవాదులను మట్టుబెట్టడంతో పాటు తోటి సైనికులను రక్షించారు. దీంతో మేజర్ రాంగోపాల్ నాయుడును ఈ ఏడాది మే 22వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శౌర్య పురస్కారమైన కీర్తి చక్రతో సత్కరించారు. ఈ అవార్డుకు ఎంపికైన మొట్టమొదటి తెలుగు వ్యక్తిగా రాంగోపాల్ నాయుడు నిలిచారు. దేశం కోసం అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించి కీర్తి చక్ర అవార్డు పొందిన రాంగోపాల్ నాయుడును ఈ సందర్భంగా మంత్రి లోకేష్ అభినందించారు. దేశంతో పాటు రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావడం గర్వకారణంగా ఉందని ప్రశంసించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.









# పేదల పెన్నిధి ఆర్డీటీ సేవలు ఆగవు..

- విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అభయం
- కేంద్రంతో నిరంతర సంప్రదింపులు
- కొలిక్కివస్తున్న మంత్రి లోకేష్ ప్రయత్నాలు
- త్వరలో ఫలించే అవకాశం

అమరావతి (చైతన్యరథం): రాయలసీమతోపాటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో గ్రామీణులకు సేవలందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్డీటీ) సేవలు నిరంతరాయంగా కొనసాగేందుకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అలుపెరుగని కృషి చేస్తున్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వంతోనూ, సంబంధిత ఉన్నతాధికారులతోనూ, సంస్థలతోనూ నిరంతరం సంప్రదింపులు సాగిస్తున్నారు. విద్య, వైద్య, విజ్ఞాన, ఉపాధి వికాస రంగాల ద్వారా తెలుగు రాష్ట్రాల్లో పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఆర్డీటీ సేవలు పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు మంత్రి లోకేష్ చేస్తున్న ప్రయత్నాలు కొలిక్కి వస్తున్నాయి. త్వరలో ఆర్డీటీ సేవలు, కార్యకలాపాలు యథావిధిగా సాగే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఆర్డీటీ సంస్థకు విదేశాలనుంచి వచ్చే నిధుల వినియోగాన్ని ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ కింద కేంద్రం నిలిపేయడంతో ఫారిన్ కాంట్రిబ్యూషన్ ఖాతాల్లో ఉన్న నిధులను సంస్థ వినియోగించడానికి వీలు లేకుండా పోయింది. దీంతో లోకల్ కాంట్రిబ్యూషన్ ఖాతాలో ఉన్న నిధులనే సేవా కార్యక్రమాలకు వాడాల్సి వస్తోంది. ఫలితంగా అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాలతోపాటు తెలంగాణలోని మహబూబ్‌నగర్ వంటి ప్రాంతాల్లో ఈ సంస్థ చేపడుతున్న విద్య, వైద్యం, స్వయంఉపాధి కార్యక్రమాలు నిలిచిపోయే ప్రమాదమేర్పడింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సంస్థ నిర్వహిస్తున్న పాఠశాలల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది.

యువగళం పాదయాత్ర సమయంలో అనంతపురంలో ఆర్డీటీ సేవా కార్యక్రమాలను యువనేత నారా లోకేష్ ప్రత్యక్షంగా చూశారు. ప్రభుత్వంతో సమాంతరంగా విద్య, వైద్య, ఉపాధి రంగాల ద్వారా పేదలకు ఆర్డీటీ అందిస్తున్న నిస్వార్థ సేవలను చూసి, తాము అధికారంలోకి వచ్చాక ఆర్డీటీ సేవలు విస్తరించేందుకు అన్ని విధాలా సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం కూటమి ప్రభుత్వం కొలువయ్యాక ఆర్డీటీ నిర్వాహకులు మాంఛో ఫెర్రర్.. మంత్రి నారా లోకేశ్‌తో భేటీ అయ్యారు. రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్.. సేవలు విస్తరణకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని ఆ సందర్భంగా మంత్రి లోకేష్ భరోసా ఇచ్చారు.







ఆర్డీటీ నిర్వహిస్తున్న ఆసుపత్రుల నుంచి వస్తున్న ఆదాయాన్ని ఎఫ్‌సీ ఖాతాలో కాకుండా ఎల్‌సీ ఖాతాలో జమ చేశారనే అభియోగంపై కేంద్రం ఫారిన్ కాంట్రిబ్యూషన్ నిధులు వినియోగానికి అనుమతులు నిరాకరించింది. ఆర్డీటీకి వస్తున్న నిధులను ఇతర ఎన్జీవోలు చేపట్టే కార్యక్రమాలకు వెచ్చిస్తున్నారనే ఆరోపణలతో ఆంక్షలు విధించడంతో ఆర్డీటీ సేవలు ప్రశ్నార్థకమయ్యాయి.

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో 3,500 గ్రామాల్లో ఆర్డీటీ సేవలందిస్తోంది. శ్రీసత్యసాయి జిల్లాలోని బత్తలపల్లి, అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం, కణేకల్లు ప్రాంతాల్లో 600కుపైగా పడకలతో మూడు ఆసుపత్రులను ఆర్డీటీ నిర్వహిస్తోంది. ఏటా 8.5 లక్షల మంది అవుట్‌పేషెంట్లు, 60 వేలకుపైగా ఇన్‌పేషెంట్లకు సేవలందిస్తోంది. కరోనా సమయంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిని కోవిడ్ సెంటర్‌గా మార్చి పది వేల మందికి చికిత్స అందించింది. మూగ, చెవిటి, మానసిక వికలాంగులైన విద్యార్థులకు అనంతపురంలో మూడు ప్రాథమిక, రెండు ఉన్నత పాఠశాలలను ఆర్డీటీ నిర్వహిస్తోంది. కేంద్రం ఆంక్షలతో ఇప్పుడు ఈ సేవలన్నీ నిలిచిపోయే ప్రమాదమేర్పడింది.

తెలుగు రాష్ట్రాల్లో పేదల పాలిట వరంగా మారిన ఆర్డీటీ సేవలను నిరంతరాయంగా కొనసాగించేందుకు , మరింత విస్తృత పరిచేందుకు తన వంతు సాయం అందిస్తానని మాటిచ్చిన మంత్రి నారా లోకేష్, ఇచ్చిన మాట నిలబెట్టుకునే దిశగా కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఆర్డీటీ సేవలకు ఎదురైన అడ్డంకులన్నీ తొలగిపోయి...మళ్లీ యథావిధిగా సేవలు కొనసాగేలా నారా లోకేష్ చేస్తున్న కృషి త్వరలో ఫలించనుందని విశ్వసనీయ సమాచారం.

చైతన్యరథం

# భగవత్ స్వరూపుడు ఎన్టీఆర్

**కొనియాడిన ఎన్టీఆర్ లిటరేచర్, గ్లోబల్ నెట్‌వర్క్ చైర్మన్ టీడీ జనార్ధన్ - న్యూజిలాండ్ రాజధాని అక్లాండ్‌లో వేడుకగా ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలు**





ఎన్నారై తెలుగు దేశం పార్టీ, అక్లాండ్ తెలుగు అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో న్యూజిలాండ్ రాజధాని అక్లాండ్‌లో ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలు స్థానిక తెలుగు కుటుంబాల మధ్య కన్నుల పండుగగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎన్టీఆర్ లిటరేచర్, గ్లోబల్ నెట్‌వర్క్ చైర్మన్ టీడీ జనార్ధన్, వైస్ చైర్మన్ అశ్విన్ అట్లూరి, శాసనసభ్యులు బోడే ప్రసాద్, ఆత్మీయ అతిథిగా ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ పాల్గొన్నారు.

దీపప్రజ్వలన కార్యక్రమం అనంతరం 'తారకరామం', 'స్వర్ణాంధ్ర సారథి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీ ప్రసంగాలు' రెండు పుస్తకాల ప్రతుల ఆవిష్కరణ జరిగింది. ఆత్మీయ అతిథి నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ సప్తసముద్రాలు దాటి వచ్చి ఇక్కడ తెలుగు వారి సమక్షంలో అన్న ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకను జరుపుకోవడం అపూర్వమని కొనియాడారు. ఆయన తన ప్రసంగంలో ఎన్టీఆర్ సినీ, రాజకీయ జీవితాల్లోని ముఖ్యవిశేషాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్టీఆర్‌కు తొలుత సినిమాల్లో అవకాశం కల్పించిన కృష్ణవేణమ్మకి ఘనంగా నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ ధరించిన పాత్రల ప్రభావం ఆయన వ్యక్తిత్వంపై ఉండేదని పేర్కొన్నారు. చైనా యుద్ధం, రాయలసీమ కరువు, దివిసీమ తుఫాను మొదలైన విపత్తులు సంభవించినప్పుడు తోటి కళాకారులతో కలసి నాటకాలు ప్రదర్శించి, జోలెపట్టి విరాళాలు సేకరించి ఆపన్నులను ఆదుకున్నారని, దేశాభిమానాన్ని చాటిచెప్పారని పెర్కొన్నారు. రాజకీయాలలోకి వచ్చి కర్షక, కార్మిక, మహిళా పక్షపాతిగా అనేక విప్లవాత్మక పథకాలు ప్రారంభించారని గుర్తుచేశారు. తిరుమలలో మొట్టమొదటిసారి అన్నదాన పథకం మొదలు పెట్టింది ఎన్టీఆరేనని, ఆయన కుమారుడిగా పుట్టడం తన పూర్వజన్మ సుకృతంగా పేర్కొన్నారు. తనను ఈ కార్యక్రమానికి ఆహ్వానించి అవకాశం కల్పించిన నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

**భావితరాలకు ఎన్టీఆర్ ఔన్నత్యం తెలియజేయడమే లక్ష్యం: టీడీ జనార్ధన్**

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్టీఆర్ లిటరేచర్, గ్లోబల్ నెట్‌వర్క్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్ధన్ మాట్లాడుతూ తాను ప్రపంచ వ్యాప్తంగా ఎన్టీఆర్ శతజయంతి వేడుకలను, సినీ వజ్రోత్సవ వేడుకలను నిర్వహిస్తూ...ఎన్టీఆర్ సినీ, రాజకీయ, సామాజిక జీవితాల ప్రాధాన్యతను, ఔన్నత్యాన్ని అందరికీ తెలియజేస్తున్నానని వివరించారు.

ఎన్టీఆర్ శతజయంతిని పురస్కరించుకొని 2023లో విజయవాడలో, హైదరాబాద్‌లో సినీ, రాజకీయ ప్రముఖుల్ని, జాతీయస్థాయి నాయకుల్ని పిలిచి ఘనంగా వేడుకలను నిర్వహించిన తీరుతెన్నులను వివరించారు. దేశంలో ఏ నాయకుడికి జరగని విధంగా శతజయంతి ఉత్సవాలు ఎన్టీఆర్‌కి జరిగిన విషయాన్ని గుర్తుచేశారు. తాము ఈ కార్యక్రమాల్ని నిర్వహించటంలో నారా చంద్రబాబునాయుడు, నందమూరి బాలకృష్ణ, నారా లోకేష్‌ల సంపూర్ణ సహకారం ఉందని పేర్కొన్నారు.

కాగా, భారత ఇతిహాసాలైన రామాయణం, మహాభారతం ఏ విధంగానైతే ప్రజల జీవితాల్ని ప్రభావితం చేస్తున్నాయో, ఎన్టీఆర్ సినీ, రాజకీయ జీవితం వర్తమాన, భావితరాలకు ఆ విధంగానే ఆదర్శప్రాయంగా, మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ఎన్టీఆర్ ఏడాదికి 10 చిత్రాలు...అది కూడా విభిన్న జోనర్‌లలో భిన్నమైన సాంఘిక, చారిత్రక, పౌరాణిక పాత్రలు ధరించి వైవిధ్యత చూపారని, అది ప్రపంచంలో ఏ ఒక్క నటుడికీ సాధ్యం కాలేదని చెప్పారు. అందువల్లనే ఎన్టీఆర్‌కు ఎన్టీఆరే సాటి అని, ఆయనొక భగవత్ స్వరూపుడని పేర్కొన్నారు.

ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు తన వృత్తిని వదిలి వారికి సాయం చేయడానికి కదిలారని, అందుకు గాను విజయా సంస్థ తన కాంట్రాక్టును తీసివేసినా... ప్రజలే నాకు ముఖ్యం అని సొంతంగా సినీ బ్యానర్ ఎన్ఏటి సంస్థ ఏర్పాటు చేసి సొంతంగా సినిమాలు తీశారని గుర్తుచేశారు.

ఎన్టీఆర్ రాజకీయ జీవితంలో మహోజ్జ్వల ఘట్టాలు అనేకం ఉన్నాయని... పేదవాడికి కనీసావసరాలైన కూడు, నీడ, గుడ్డ అందించారని, దేశంలోనే తొలిసారి సంక్షేమ పింఛన్లు అందించారని చెప్పారు.

తనలాంటి యువకుల్ని రాజకీయాల్లోకి ప్రోత్సహించి రాజకీయాల్లో యువరక్తం ఎక్కించారని, నీతి నిజాయితీలకు పెద్దపీట వేశారన్నారు. మహిళలకు, బడుగు బలహీన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించిన విషయాలు గుర్తుచేశారు. ఎన్టీఆర్ సినీ, రాజకీయ రంగాలలో చేసిన కృషిని, సాధించిన విజయాలను, చరిత్రగతిని మార్చిన తీరుతెన్నులను అందరికీ తెలియజెప్పే ఉద్దేశంతో ఇప్పటికే ఎన్టీఆర్ జీవితానికి సంబంధించిన పలు గ్రంథాలు వెలువరించామని, రాబోయే కాలంలో మరి కొన్ని పుస్తకాలు తీసుకొస్తామన్నారు. అన్న ఎన్టీఆర్ యూట్యూబ్ ఛానెల్ ప్రారంభించి ఎన్టీఆర్‌తో సాన్నిహిత్యం గలిగిన అన్ని రంగాల ప్రముఖుల ఇంటర్వ్యూలు, అభిప్రాయాలు అందిస్తున్నామని, వాటిని అందరూ వీక్షించాలని కోరారు.

ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులకు, స్థానిక తెలుగు కుటుంబాలకు టీడీ జనార్ధన్, నందమూరి రామకృష్ణ శాలువాలు కప్పి సత్కరించారు. స్థానిక కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. అన్న ఎన్టీఆర్ స్ఫూర్తి... ప్రవాస తెలుగు వారందరిలో ప్రస్ఫుటంగా కనిపించిందని నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు.

# వామపక్షాల వంకరవాదం ఎవరికోసం?

వామపక్షాల స్వార్థపూరిత రాజకీయాలు ఆంధ్రప్రదేశ్‌కి శాపంగా పరిణమించాయి. మంచిచేస్తున్న ప్రభుత్వాన్ని కూడా విమర్శించడం వామ పక్షాల నైజంగా మారింది. గత ఐదేళ్లు జెండాలు మడిచి అటకపై పెట్టిన వామపక్షాలు.. నేడు చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జెండాల దుమ్ముదులిపి జనం బాటపట్టిన వామపక్షాలు వంకర వాదనతో విష ప్రచారం చేస్తున్నాయి. తాము మాత్రమే ప్రజాపక్షమైనట్టు.. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి పాలనలో ప్రజలకు నష్టం జరుగుతున్నట్లు, వారి బాధను జనం బాధగా చిత్రిస్తూ పసలేని ఆరోపణలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారు. మాకుమించిన జనోద్ధారకులు లేరన్న చందాన మాట్లాడుతున్నారు. అసత్య ప్రచారం, వంకర వాదనలతో వామపక్షాలు మళ్లీ ఎవరిని అధికారంలోకి తేవాలనుకుంటున్నాయి. రాష్ట్రం అభివృద్ధి చెందడం, ప్రశాంతంగా ఉండటం వామపక్షాలకు ఇష్టంలేదా? మళ్లీ తాలిబాన్ల పాలన తేవాలనుకొంటున్నారా? మీ ఉనికి ఉద్యమాలు, వంకర వాదనలు మీకు ఉపయోగపడవు. పరోక్షంగా అవినీతిపరులకు, అరాచకులకు, అభివృద్ధి నిరోధకులకు ఉపయోగపడతాయి. ఆంధ్రప్రదేశ్ అధోగతి పాలుకావడానికి వామపక్షాల పాత్ర నూటికి నూరుపాళ్లుంది. 2004కి ముందు కూడా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వాన్ని గద్దె దింపడం కోసం ప్రపంచ బ్యాంకు విధానాలు, ఆర్థిక సంస్కరణలంటూ గగ్గోలుపెట్టి, పెంచిన విద్యుత్ చార్జీల వంకతో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టారు. ఆ ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీని భాగస్వామిగా చేసుకున్నారు. తర్వాత చంద్రబాబుని ఓడించడానికి సిద్ధాంతాలు పక్కన పెట్టి మేము ఎవరితోనైనా చేతులు కలుపుతామంటూ ప్రతిజ్ఞలు చేసి కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని ఆ పార్టీ అధికారంలోకి రావడానికి దోహదపడ్డారు. తర్వాత ఏంజరిగింది? కాంగ్రెస్ పార్టీ సంస్కరణలు, ప్రపంచబ్యాంకు విధానాలు అమలుచేసింది. అవినీతి విచ్చలవిడితనమైంది. దోపిడీ కొత్తపుంతలు తొక్కింది. తండ్రి అధికారాన్ని అడ్డంపెట్టుకొని వేల కోట్లు దోపిడీ చేసిన జగన్ రెడ్డి.. తండ్రి మరణానంతరం ఆ డబ్బుతో రాజకీయ పార్టీ స్థాపించి, ప్రజలకు అబద్ధాలు చెప్పి, మాయచేసి అధికారంలోకి వచ్చాడు. గత ఐదేళ్లు రాష్ట్రంలో ఏంజరిగిందో, రాష్ట్రం ఎంత విధ్వంసమైందో వామపక్షాలు చూశాయి. ఇప్పుడు ప్రతి దానికి వంకర వాదన చేస్తూ కూటమి ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తూ మళ్లీ పరోక్షంగా వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. అబద్ధాలతో అభివృద్ధిని అడ్డుకొంటున్నాయి. ప్రజాహితం కోసం రాజకీయ పార్టీలు పనిచేయాలి. అంతే కానీ బీజేపీతో చంద్రబాబు కలిశారన్న దుగ్ధతో ఆయన విధానాలను వ్యతిరేకిస్తూ గుడ్డిగా అభివృద్ధికి అడ్డుపడటం సమర్థనీయం కాదు.

బనకచర్ల ప్రాజెక్టు అవసరం లేదని, ప్రాజెక్టు ప్రతిపాదన వెనుక కూటమి ప్రభుత్వ కుట్ర దాగి ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అనడం బాధ్యతా రాహిత్యం. ఇటువంటివారికి వ్యవసాయం, రైతాంగంపట్ల మాట్లాడే అర్హత ఉందా? అట్లాగే అతిశయాలతో ఆత్మస్తుతి, మోడీ స్తుతి కోసమేనా మహానాడు? అంటూ మరొక మేధావి మహానాడుపై విషంకక్కుతూ వ్యాసం రాసాడు. వామపక్షాలు ఒక కుట్ర పూరిత వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలు బలిపెడుతున్నాయి. వామపక్షాలు వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని రాజకీయ పరిశీలకులే అంటున్నారు. జనానికి మద్దతుగా నిలబడాల్సిన వామపక్షాలు జగన్‌కి మద్దతుగా నిలుస్తున్నాయి. తమ రాజకీయ అవసరాల కోసం మాత్రమే కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఉద్యమానికీ స్థానముంటుంది. కాని, ఆ ఉద్యమం ప్రజా ప్రయోజనాల కోసం మాత్రమే చెయ్యాలి తప్ప.. ప్రతిపక్ష వైసీపీకి మేలు చేసే విధంగా చెయ్యడాన్ని ప్రశ్నించాల్సి వస్తుంది. వామపక్షాలు ఉద్యమాల పేరిట రాజకీయ అజెండాలు నెరవేర్చుకొనే ప్రయత్నం చేస్తున్నాయి. నిజమైన ప్రజా సమస్యలపై ఉద్యమిస్తే ఎవరికీ అభ్యంతరముండదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న అంశాలపై గత ఐదేళ్లు జగన్ ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించలేదు. ఎందుకు ఉద్యమాలు చెయ్యలేదు? అప్పుడు తప్పుగా కనిపించని అంశాలు ఇప్పుడెందుకు తప్పుగా కనిపిస్తున్నాయి? కూటమి ప్రభుత్వం ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా, సంక్షేమం మరియు అభివృద్ధిని సమతూకంగా ముందుకు తీసుకెళ్తుంది. కూటమి ప్రభుత్వంపై వామపక్షాలు చేస్తోన్న విమర్శలు ఎక్కువగా అసంబద్ధమైనవే తప్ప గౌరవించదగినవిగా లేవు. ప్రజల అవసరాలపై కాకుండా, రాజకీయ వ్యతిరేకత ఆధారంగా విమర్శలు చేస్తున్నారు. అమరావతిని కేంద్రంగా చేసుకొని రాష్ట్రాన్ని మళ్లీ ప్రాంతీయ అసమతుల్యతవైపు తీసుకెళ్తున్నారు. కూటమి ప్రభుత్వం అమరావతిని పూర్తిస్థాయి రాజధానిగా పునరుద్ధరించడం ద్వారా వైద్య, విద్య, ఉపాధి, మౌలికవసతులు ఏర్పాటుచేసి అర్థవంతమైన అభివృద్ధి చెయ్యాలని శ్రమిస్తుంటే, అమరావతి అభివృద్ధి, పరిశ్రమల నెలకొల్పడం, ఉద్యోగాల కల్పనవంటి చర్యలపై కూడా వ్యతిరేకంగా మాట్లాడటం ద్వారా వైసీపీ అధినేత జగన్‌కంటే వామపక్షాలే ఎక్కువగా విముఖత చూపిస్తున్నాయి.

గత ఐదేళ్లు జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని ఎంత విధ్వంసం చేసినా నోటికి ప్లాస్టర్లు వేసుకొన్న వామపక్షాలు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజులు నుంచే అసత్యాలతో ప్రజలను తప్పుదోవపట్టించే ప్రయత్నం చేస్తున్నారు. జగన్ పాలనలో అన్ని రంగాలు కుప్పకూలాయి, అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. అన్నివర్గాల ప్రజలు అవస్థలు పడాల్సిన దుస్థితి. భూమాఫియా, గనులమాఫియా, ఇసుకమాఫియా, మద్యం మాఫియా, మట్టి మాఫియా, కొత్తగా డ్రగ్స్ మాఫియాతో దోపిడీచేసి రాష్ట్రాన్ని దొంగలు దోచుకున్న ఇల్లులా మార్చారు. ప్రజారోగ్యం, విద్య గాలిలో దీపమయ్యాయి. పారిశ్రామిక రంగం పతనమైంది. పల్లెపల్లెలో వలస వేదనే మిగిలింది. నిరుద్యోగులు వంచనకు గురయ్యారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థుల సంక్షేమం దైవాదీనమైంది. విద్యుత్ చార్జీలు 9సార్లు పెంచి ప్రజలపై రూ.60 వేలకోట్ల భారం మోపారు. ధరలు పెరిగి బతుకు భారమై మధ్యతరగతి పేదలుగానూ, పేదలు నిరుపేదలుగానూ మారారు. అమరావతిని నాశనం చేశారు. వ్యవసాయం, నీటిపారుదల రంగం, రోడ్లు, విద్యుత్ అన్ని రంగాలు నేలమట్టమయ్యాయి. విభజన అనంతరం 2014- 19 మధ్య అభివృద్ధిపథాన దూసుకుపోతున్న రాష్ట్రాన్ని స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్ పరిపాలనపై వామపక్షాలు ఎందుకు నోరుమెదపలేదు. ఐదేళ్లు మౌనంగావున్న వారు కూటమి పాలనలో ఏదో జరిగిపోయినట్టు వారి పత్రికలలో వ్యాసాలు రాయడం, పరిపాలనపై విమర్శలకు దిగడం సంకుచిత రాజకీయాలకు నిలువుటద్దం.

వాస్తవాలను దాచిపెట్టి చంద్రబాబుని విమర్శించినంత మాత్రాన ప్రజలు నమ్మేస్తారనుకోవడం పిచ్చితనం. వామపక్షాలది ఉనికి కాపాడుకునే ప్రయత్నమే తప్ప.. విశ్వసనీయత లేదన్నది వాళ్లకూ తెలుసు. కాలం గడిచేకొద్దీ కాలగర్భంలో కలిసిపోతున్నా.. కాలం చెల్లిన సిద్ధాంతాలు విడనాడటం లేదు. గతంలో వామపక్షాలు మాత్రమే నిజాలు చెబుతారనే నమ్మకం ప్రజల్లో ఉండేది. కానీ ఇప్పుడు అందరికన్నా వారే ఎక్కువ అబద్ధాలు ఆడుతున్నారన్న నమ్మకంతో ప్రజలున్నారు. కమ్యూనిజం కోసం దేశమంతా ఎదురుచూస్తోందని కమ్యూనిస్టులు ఇంకా కలలుగంటున్నారు. కానీ వారిని దేశ ప్రజలు ఎప్పుడో మరచిపోయారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే కాదు,జాతీయస్థాయిలోనూ కమ్యూనిస్టులు ఉనికి కోల్పోయారు. వికృత రాజకీయాలకు పాల్పడటమే అందుకు కారణం. ఇప్పటికైనా కమ్యూనిస్టులు వాస్తవాలను గ్రహించి ప్రజా సంక్షేమాన్ని కాంక్షించాలి. కూటమి ప్రభుత్వంపై చేస్తోన్న విష ప్రచారాన్ని మానుకుని.. ప్రజలతో నడవాలి. ప్రజా సంక్షేమానికి తమవంతు సహకారం అందించాలి.

**- నీరుకొండ ప్రసాద్**

# మసులా బీచ్ ఫెస్టివల్లో హెలీ రైడ్స్ ప్రారంభం




**- సీ కయాకింగ్ పోటీలు కూడా..**

మచిలీపట్నం (చైతన్యరథం): మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్‌లో జరుగుతున్న మసులా బీచ్ ఫెస్టివల్ రెండో రోజు శుక్రవారం కూడా పర్యాటకుల కోలాహలంతో కొనసాగుతోంది. ఇందులో భాగంగా హెలీ రైడ్స్‌ను రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. అనంతరం హెలికాప్టర్‌లో బీచ్ పరిసర ప్రాంతాలతోపాటు మసులా బీచ్‌కి వచ్చే పర్యాటకులకు ట్రాఫిక్ ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని పరిశీలించారు. దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద ఈవెంట్‌గా గుర్తింపు పొందిన ఈ ఫెస్టివల్ 8వ తేదీ వరకు కొనసాగనుంది. అదే విధంగా 3వ జాతీయ స్థాయి సీ కయాకింగ్ పోటీలను కూడా మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహిస్తున్న సీ కయాకింగ్ పోటీల్లో పాల్గొనేందుకు 17 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. 3 రోజులపాటు జరగనున్న ఈ పోటీలను చూసేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు.





### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కి

# మంత్రి పయ్యావుల ఘన స్వాగతం



పుట్టపర్తి (చైతన్యరథం): శ్రీసత్యసాయి జిల్లా పాలసముద్రంలోని నాసిన్ కేంద్రంలో నిర్వహించే పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు శుక్రవారం ఉదయం రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మర్యాదపూర్వకంగా కలిసి నంది విగ్రహాన్ని, పుష్పగుచ్ఛాఆన్ని అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, ఈడబ్ల్యూఎస్, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత, హిందూపురం పార్లమెంట్ సభ్యులు పార్థసారథి పాల్గొన్నారు.




# విశాఖ రైల్వేజోన్‌పై కేంద్రం ప్రత్యేక శ్రద్ధ

**- జీఎం నియామకంపై మంత్రి డోలా కృతజ్ఞతలు**

అమరావతి (చైతన్యరథం): విశాఖ సౌత్‌కోస్ట్ రైల్వే జోన్‌కి జీఎంను నియమించిన కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, విశాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ధన్యవాదాలు తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల విశాఖ రైల్వే జోన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ఆంధ్ర రాష్ట్ర ప్రజల తరఫున శుక్రవారం ఒక ప్రకటనలో మంత్రి డోలా కృతజ్ఞతలు తెలిపారు. విశాఖ సౌత్ కోస్ట్ రైల్వే జోన్ జీఎంగా నియమితులైన సందీప్ మధుకు అభినందనలు తెలుపుతున్నానన్నారు. ఆయన బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి రైల్వేజోన్ అభివృద్ధి కృషి చేస్తారని ఆకాం క్షించారు. విశాఖ రైల్వేజోన్ తో ఉత్తరాంధ్ర ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది. రాష్ట్ర ప్రయోజనాల కోసం సీఎం చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారు. రాష్ట్రాభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యం. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంతో రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని మంత్రి డోలా స్పష్టం చేశారు.



# లక్ష్యాన్ని మించి దూసుకుపోతున్న యోగాంధ్ర

**- మొదటి 2 వారాల్లోనే శిక్షణలో నెలవారీ లక్ష్యాన్ని దాటిన ప్రగతి**

**- ఇప్పటికే పూర్తయిన 93 శాతం పౌరుల నమోదు**

**- వైద్యారోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యర్శి ఎంటీ కృష్ణబాబు వెల్లడి**

అమరావతి (చైతన్యరథం): ప్రజల్లో యోగాపై అవగాహన పెంచి, మరింత ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన నెల రోజుల యోగాంధ్ర వివిధ అంశాలకు సంబంధించి లక్ష్యాలను అధిగమిస్తూ దూసుకుపోతోంది. మే 21న ప్రారంభించిన ఈ నమోదు కార్యక్రమం ద్వారా యోగా కార్యక్రమాల్లో పాల్గొనడానికి పౌరుల నమోదు 2 కోట్ల లక్ష్యంగా పెట్టుకోగా, గురువారం నాటికి 1,86,46,143 మంది యోగా ఔత్సాహికులు ఇప్పటికే నమోదు చేసుకున్నారని యోగాంధ్ర పురోగతిని పర్యవేక్షిస్తున్న వైద్యారోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, యోగాంధ్ర రాష్ట్ర సమన్వయకర్త ఎం.టి. కృష్ణబాబు తెలి పారు. నిర్దేశించుకున్న లక్ష్యంలో ఇది 93 శాతం అని ఆయన వివరించారు. యోగాంధ్ర కార్యక్రమ కార్యకలాపాలకు ఇంకా 2 వారాలు మిగిలి ఉన్నందున తుది నమోదు 2 కోట్ల లక్ష్యాన్ని మించిపోయే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

**నెలవారీ లక్ష్యాన్ని దాటాం**

శిక్షకుల నమోదు మరియు శిక్షకులకు శిక్షణకు సంబంధించి నిర్దేశించుకున్న నెలవారీ లక్ష్యాన్ని ఇప్పటికే అధిగమించామని ఆయన చెప్పారు. 2,600 మంది మాస్టర్ ట్రైనర్ల నమోదు లక్ష్యానికి గాను 5,451 మంది (209%) ఇప్పటికే నమోదు చేసుకున్నారన్నారు. మండల స్థాయిలో 1,25,000 మంది లక్ష్యానికి గాను 118 శాతం మంది అంటే 1,47,817 మంది శిక్షకులు నమోదు చేసుకున్నారని ఆయన వివరించారు. శిక్షకులకు శిక్షణకు సంబంధించి 5,451 మంది మాస్టర్ ట్రైనర్లు (లక్ష్యంలో 206%), 1,43,881 (115%) మంది మండల్ ట్రైనర్లకు ఇప్పటివరకు శిక్షణ ఇచ్చామన్నారు.

ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 1,34,991 ప్రదేశాల్ని నమోదు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకోగా ఇప్పటివరకు 78,730 ప్రదేశాల్ని నమోదు చేశారని కృష్ణబాబు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా పాల్గొనే ప్రధాన కార్యక్రమం విశాఖపట్నంలో జరుగుతుందని తెలిపారు.

యోగాంధ్ర నెలలో 26 జిల్లాల్లో జరిగే సన్నాహక యోగా కార్యక్రమాల్లో మొదటి రెండు వారాల్లో 11 చోట్ల యోగా ప్రదర్శనలు జరిగాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 100 పర్యాటక ప్రదేశాలలో 42 చోట్ల కార్యక్రమాలు జరిగాయని, గ్రామ, మండల స్థాయిలో ఇప్పటివరకు మొత్తం 15,783 యోగా సంబంధిత పోటీలు నిర్వహించామని ఆయన వివరించారు.

ఈ నెల 21న విశాఖపట్నం-భీమిలి తీరం వెంబడి ఒకే చోట 5 లక్షల మంది పాల్గొనే యోగా కార్యక్రమాలను రికార్డు స్థాయిలో నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే అధికారులకు లక్ష్యాలను నిర్దేశించారని ఆయన తెలిపారు

### పహల్గాం మృతుడి కుటుంబానికి..

# డిప్యూటీ సీఎం పవన్ రూ.50 లక్షల సాయం

**- కావలిలో చెక్కు అందజేసిన మంత్రి కందుల దుర్గేష్**



కావలి (చైతన్యరథం): గత ఏప్రిల్‌లో జమ్ముకశ్మీర్‌లో విహారయాత్రకు వెళ్లి పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మధుసూదన్‌రావు కుటుంబాన్ని పరామర్శించి, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనల మేరకు వ్యక్తిగతంగా రూ.50 లక్షల ఆర్థిక సాయం అందించినట్లు మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. శుక్రవారం కావలి వెళ్లిన మంత్రి దుర్గేష్, టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌తో కలిసి మధుసూదన్ కుటుంబీకులను కలిశారు. ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తామని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మధుసూదన్ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. కష్టాల్లో ఉన్న కుటుంబానికి జనసేన అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వ్యక్తిగతంగా 8వ తరగతి చదువుతున్న మధుసూదన్ కొడుకుకి రూ.22.50 లక్షలు, ఇంటర్మీడియట్ చదువుతున్న కూతురుకి రూ.22.50 లక్షలు, ఆయన తల్లిదండ్రులకు రూ. 5 లక్షలు ఆర్థికసాయం ప్రకటించగా తాము నేరుగా అందజేశామని మంత్రి దుర్గేష్ వెల్లడించారు.

# విశాఖ రైల్వేజోన్ ఏర్పాటులో కీలక ముందడుగు

- జీఎం నియామకంపై మంత్రి అచ్చెన్నాయుడు హర్షం
- త్వరలో గెజిట్ నోటిఫికేషన్‌కు కసరత్తు
- ప్రధాని మోదీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకి కృతజ్ఞతలు

అమరావతి (చైతన్యరథం): ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు మరో ముందడుగు పడిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు ప్రక్రియ శర వేగంగా సాగుతోందన్నారు. అందులో భాగంగా రైల్వే జోన్‌కు తొలి జీఎం గా సందీప్ మాథుర్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించడం హర్షణీయమన్నారు. జోన్ ఏర్పాట్లు లో దీనిని అత్యంత కీలకమైన చర్యగా పేర్కొన్నారు. పరిపాలన అనుమతులు పనులు వేగవంతం అయ్యేందుకు ఇది ఉపకరిస్తుందని తెలిపారు. రైల్వే జోన్ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఐదేళ్లపాటు వైసీపీ ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యం కారణంగా రైల్వేజోన్ పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. జోన్ కార్యలయం ఏర్పాటుకకు అవసరమైన 54 ఎకరాల భూమి కేటాయించకుండా వైసీపీ పాలకులు నిర్లక్ష్యం వహించారన్నారు. దీనివల్ల ఉత్తరాంధ్రకు తీరని అన్యాయం జరిగిందని. ప్రస్తుతం రైల్వే జోన్ ఏర్పాటు ప్రక్రియ తిరిగి ప్రారంభమై వేగవంతంగా పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇప్పటికే 54 ఎకరాల భూమిని రైల్వే శాఖకు అప్పగించారన్నారు. జోన్ ఏర్పాటుతో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందడంతో పాటు రైల్వే ఆపరేషన్స్ సమర్థవంతంగా చేపట్టేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. విశాఖలోని ముడసర్లోవలో ఇప్పటికే స్థలాన్ని కేటాయించడం జరిగిందని తెలిపారు. రూ 149 కోట్ల వ్యయంతో 9 అంతస్తుల రైల్వేజోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణం జరుగుతుంది. సీఎం చంద్రబాబు ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ ప్రధానమంత్రి , రైల్వే శాఖ మంత్రితో చర్చలు జరిపి రైల్వే జోన్ ఏర్పాటులో వేగం పెంచారు. గత 12 నెలల కాలంలో రూ.75 వేలకోట్ల జాతీయ రహదారి ప్రాజెక్టులు, రూ.72 వేల కోట్ల రైల్వే ప్రాజెక్టులు కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి తీసుకువచ్చారు. తద్వారా రాష్ట్ర అభివృద్ధి చురుగ్గా సాగుతోంది. విశాఖ రైల్వే జోన్ పై గెజిట్ నోటిఫికేషన్ త్వరలో ఇచ్చేలా ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుంది. దీనివలన ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని మంత్రి అచ్చెన్నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు.




# ఆప్కాబ్ చైర్మన్ గన్ని బాధ్యతల స్వీకరణ

*- అభినందించిన మంత్రి అచ్చెన్నాయుడు*



విజయవాడ (చైతన్యరథం): ఆప్కాబ్ చైర్మన్‌గా నియమితులైన గన్ని వీరాంజనేయులు శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు, తెలుగుదేశం అభిమానులు తోడురాగా ఆప్కాబ్ అధికారులు, సిబ్బంది సమక్షంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు కార్యాలయం వద్దకు చేరుకున్న వీరాంజనేయులికి వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గన్ని దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆప్కాబ్ ఎండీ ఎస్ఆర్ రెడ్డి, సీజీఎం, డీజీఎం, ఏజీఎంలతో పరిచయ కార్యక్రమంలో పాల్గొన్న వీరాంజనేయులు.. అందరం కలిసికట్టుగా పనిచేసి ఆప్కాబ్ అభివృద్ధికి కృషి చేద్దామన్నారు. ముందుగా ఆప్కాబ్ ఆవరణలో స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పదవీ భాధ్యతల అనంతరం సెంట్రల్ మానిటరింగ్ యూనిట్ (సీసీ కెమెరా యూనిట్)ను ప్రారంబించి తదుపరి అంతర్జాతీయ కోఆపరేటివ్ సంవత్సరం సందర్భంగా ఆవరణలో మొక్క నాటారు. ఆప్కాబ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గన్ని వీరాంజనేయులికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అభినందనలు తెలిపారు.




# ముస్లింలకు మంత్రి డోలా బక్రీద్ శుభాకాంక్షలు



అమరావతి (చైతన్యరథం): బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులందరికీ మంత్రి డోలా శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి, సహనానికి ప్రతీక బక్రీద్ అని మంత్రి డోలా పేర్కొన్నారు. ఈ పండుగ సమాజంలో స్నేహం, త్యాగం, మానవతా విలువలను బలపరిచేలా అందరినీ ప్రేరేపిస్తుంది. మత, మానవతా విలువలకు ప్రతిబింబంగా నిలిచే బక్రీద్ ప్రజలందరిలో ఐక్యతా, సమానతా భావాలను మరింతగా పెంపొందించాలని కోరుకుంటున్నానన్నారు. ఈ పవిత్ర పర్వదినం ప్రతి ఒక్కరికి ఆనందం, శాంతి, ఆరోగ్యాన్ని అందించాలని మంత్రి డోలా ఆకాంక్షించారు.

**డిప్యూటీ సీఎం పవన్, ఎంపీ పురందేశ్వరి చేతుల మీదుగా..**

# 19న అఖండ గోదావరి ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన



- ఈ ప్రాజెక్టుతో గోదావరి పరిసర ప్రాంతాల్లో పర్యాటకానికి కొత్త సొబగులు
- చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని తెలిపేలా ఏర్పాట్లు
- సందర్శకులకు మెరుగైన వసతుల కల్పన
- మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి

అమరావతి/రాజమహేంద్రవరం: కేంద్ర ప్రభుత్వ సహకారంతో మంజూరైన ప్రతిష్ఠాత్మక అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు ఈ నెల 19న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎంపీ పురందేశ్వరి శంకుస్థాపన చేయనున్నారని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. సాస్కి -2024-25 (స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) స్కీమ్ ద్వారా మంజూరైన రూ.97 కోట్లతో రాజమహేంద్రవరం, ధవళేశ్వరం, కడియం, కొవ్వూరు, నిడదవోలు తదితర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధి పనులు జరగనున్నాయని మంత్రి దుర్గేష్ శుక్రవారం తెలిపారు. పవిత్ర గోదావరి పుష్కరాలలోపే ప్రాజెక్టు పనులు పూర్తవుతాయని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. తద్వారా గోదావరి పరిసర ప్రాంతాలు సరికొత్త సొబగులు సంతరించుకోనున్నాయన్నారు. చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని తెలిపేలా సందర్శకులకు మెరుగైన వసతుల కల్పనతో పాటు మంచి అనుభూతిని అందిస్తామని మంత్రి దుర్గేష్ వివరించారు.

**అద్భుత పర్యాటక కేంద్రంగా హేవలాక్ బ్రిడ్జి**

రాజమహేంద్రవరంలో గోదావరిపై నిర్మించిన 127 ఏళ్ల చరిత్ర గలిగి వారసత్వ సంపదకు ప్రతీకగా నిలిచిన చారిత్రాత్మక హేవలాక్ బ్రిడ్జిని ఆధునీకరిస్తామని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. హేవలాక్ వంతెన ప్రాంతంలో జలపాతాలు, గ్లాస్ వంతెనలు, గేమింగ్ జోన్, స్పేస్ థీమ్, అర్బన్ హాట్ క్రాఫ్ట్ బజార్, హ్యాంగింగ్ గార్డెన్స్, హాలోగ్రామ్ జూ, టైమ్ ట్రావెల్, రైల్ మ్యూజియం, ఆక్వేరియం టన్నెల్‌లు ఏర్పాటు చేసి అభివృద్ధి చేయనున్నామని వివరించారు. హేవలాక్ వంతెన పక్కనే ఉన్న పుష్కర్ ఘాట్ ను మరింతగా అభివృద్ధి చేసి ఆధ్యాత్మిక గమ్యస్థానంగా తీర్చిదిద్దాలని నిర్ణయించామని మంత్రి పేర్కొన్నారు. హేవలాక్ వంతెన, పుష్కర్ ఘాట్ రెండింటిని అనుసంధానించి డైనమిక్ టూరిస్ట్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దాలని భావిస్తున్నామన్నారు. పుష్కరాల రేవులో ఏడాది పొడవునా పవిత్ర స్నానాలు ఆచరించేలా, మరింత ఆధ్యాత్మికత ఉట్టిపడేలా చుట్టూ ఉన్న ఆలయాలను ఆర్కిటెక్చరల్, డిజైన్‌లతో అత్యంత సుందరంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు.

భారతదేశపు అతి పెద్ద నర్సరీలో ఒకటైన కడియం నర్సరీకి పర్యాటక శోభ తెచ్చి సమీపంలోని గోదావరి కాలువ, తదితర చారిత్రక, సాంస్కృతిక ప్రదేశాలకు పూర్వ వైభవం తేవాలని భావిస్తున్నామని మంత్రి దుర్గేష్ వివరించారు. గోదావరి చుట్టు పక్కల పర్యాటకులు ఆహ్లాదంగా సేదతీరేలా, ప్రశాంతమైన వాతావరణాన్ని ఆస్వాదించేలా, కాలువలో పడవపై షికారు చేసే విధంగా తీర్చిదిద్దనున్నామన్నారు. అఖండ గోదావరి ప్రాజెక్టులో భాగంగా విశిష్టమైన చారిత్రక నేపథ్యం కలిగి, అద్భుతమైన ప్రాకారాలు, ఆకట్టుకునే ముఖ ద్వారం, ఎత్తైన రాజ గోపురంతో తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో అలరారుతున్న ప్రముఖ మహిమాన్విత ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీకోట సత్తెమ్మ దేవాలయాన్ని మరింత వైభవంగా తీర్చిదిద్దనున్నామన్నారు. అదనపు యాత్రికుల వసతి గృహాలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఆలయ రాజగోపురం ఆధునీకరించనున్నామని వివరించారు.

# త్యాగానికి ప్రతీక బక్రీద్

**- పండుగ శుభాకాంక్షలు తెలిపిన వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్**



విజయవాడ (చైతన్యరథం): బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీక అని ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. పేదల పట్ల జాలి, దయ కలిగి ఉండడమే ఈ పండుగ ఇచ్చే సందేశమన్నారు. శనివారం బక్రీద్ నేపథ్యంలో ముస్లింలకు, రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బక్రీద్ పర్వదినం రోజున ఖుర్బానీ ఇచ్చే ముస్లింలకు ఎంతో పుణ్యఫలం లభిస్తుందన్నారు. ఈ పండుగ త్యాగనిరతికి ప్రతీక అని, ఇతరుల పట్ల ప్రతి ఒక్కరూ సోదరభావం చూపాలని పేర్కొన్నారు. త్యాగం మనిషిని ఉన్నతుడిని చేస్తుందని, మహనీయుని త్యాగానికి గుర్తుగా ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని జరుపుకుంటారని పేర్కొన్నారు. దైవ ప్రసన్నం కోసం తనకిష్టమైన ఎలాంటి వస్తువునైనా త్యాగం చేయాలని 'ఖుర్బానీ' సంప్రదాయం ప్రతి యేటా గుర్తు చేస్తుందని తెలిపారు. ప్రజలందరికీ అల్లాహ్ ఆశీస్సులు ఉండాలని అజీజ్ ఆకాంక్షించారు.

## దక్షిణ కొస్తా రైల్వే జోన్ జీఎం నియామకం హర్షణీయం

**●త్వరలో గెజిట్ నోటిఫికేషన్‌కు కసరత్తు... కింజరాపు అచ్చెన్నాయుడు**



శ్రీకాకుళం (చైతన్యరథం): ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తరాంధ ప్రజల చిరకాల స్వప్నం దక్షిణ కొస్తా రైల్వే జోన్‌కు మరో ముందడుగు పడిందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటు శరవేగంగా సాగుతుంది. అందులో భాగంగా రైల్వే జోన్‌కు తొలి జీఎంగా సందీప్ మాథుర్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించడం హర్షం నీయమన్నారు. జోన్ ఏర్పాట్లులో అత్యంత కీలకమైన చర్యగా భావిస్తున్నాను. పరిపాల అనుమతులు పనులు వేగవంతం అయ్యేందుకు ఇది ఉపకరిస్తుందని తెలిపారు. రైల్వే జోన్ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. గత ఐదేళ్లపాటు వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రైల్వే జోన్ పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. జోన్‌కు అవసరమైన 54 ఎకరాల భూమి కేటాయించకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. దీనివలన ఉత్తరాంధ్రకు తీరని అన్యాయం జరిగిందని... ప్రస్తుతం రైల్వే జోన్ పనులు తిరిగి ప్రారంభమై వేగవంతంగా పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఇప్పటికే 54 ఎకరాల భూమిని రైల్వే శాఖకు అప్పగించడం జరిగిందని, జోన్ ఏర్పాటుతో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందడంతో పాటు రైల్వే ఆపరేషన్స్ సమర్ధవంతంగా చేపట్టేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. విశాఖలోని మూడసర్ లోవలో ఇప్పటికే స్థలాన్ని కేటాయించడం జరిగిందని తెలిపారు. రూ 149 కోట్ల వ్యయంతో 9 అంతస్తుల రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణం జరుగుతుంది. ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లినప్పుడల్లా ప్రధానమంత్రి, రైల్వే శాఖ మంత్రితో దప దపాలుగా చర్చలు జరిపి రైల్వే జోన్ ఏర్పాటుకు వేగం పెంచడం అయింది గత 12 నెలల కాలంలో రూ.75 వేలకోట్ల జాతీయ రహదారి ప్రాజెక్టులు రూ.72 వేల కోట్ల రైల్వే ప్రాజెక్టులు కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి తీసుకురావడం జరిగిందని అన్నారు. తద్వారా రాష్ట్ర అభివృద్ధి చురుగ్గా సాగుతోంది. విశాఖ రైల్వే జోన్‌పై గజిట్ నోటిఫికేషన్ త్వరలో ఇచ్చేలా ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుంది. దీనివలన ఉత్తరాంధ్ర జిల్లాలకు మరింత అభివృద్ధి సూచికలు రానున్నాయని పేర్కొన్నారు.

## శిశుగృహంలో అభివృద్ధి పనుల ప్రారంభం

**●ప్రారంభించిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు**

**●శిశుగృహ సిబ్బంది, కలెక్టర్‌కు అభినందన**



శ్రీకాకుళం(చైతన్యరథం): నగరంలోని శిశుగృహం, బాలసదనంలో ఏర్పాటు చేసిన క్రెడిల్ బేబీ రిసెప్షన్ సెంటర్, సిక్‌రూమ్, రెండు పోషణ వాటికలు, మరమ్మతుల అనంతరం పూర్తయిన సుందరీకరణ పనులను కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్, మహిళా శిశు అభివృద్ధిశాఖ పీడీ బీ.శాంతిశ్రీ, డీసీపీవో రమణ, మోడల్ ఆఫీసర్ పుణ్యవతి, శిశుగృహ మేనేజర్ నరేష్, ఐసీడీఎస్, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది, దాసు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు చైల్డ్‌లైన్ హోమ్‌లో పిల్లలతో ముచ్చటించి వారి సమస్యలు, అవసరాలు తెలుసుకున్నారు. అనం తరం శిశుగృహ అభివృద్ధికి కృషిచేసిన జిల్లా కలెక్టర్, శాఖాధికారులు, సిబ్బందిని అభినందించారు.

## మా గ్రామంలోనే రేషన్ అందించండి

వేపాడు (చైతన్యరథం): మండలంలోని వీలుపర్తి శివారు చినదుంగాడ, పెదదుంగాడ, కొలికి పాలెం గిరిజనులు తమ గ్రామంలోనే రేషన్ సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. దుండాగ గ్రామం పేరున రేషన్ దుకాణం ఉన్నా డీలర్ తన సొంత గ్రామమైన చామలాదేవి అగ్రహారంలో ఇంటి వద్ద సరకులు పంపిణి చేయడం వల్ల 5 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. దీంతో వృద్ధులు, చిన్నపిల్లల తల్లులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆ వేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు స్పందించి దుంగాడ, చినదుంగాడ గ్రామాల్లో ఏదో ఒకచోట డిపో పెట్టించి సరుకు లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే విషయాన్ని వేపాడ తహసీల్దార్, సీఎస్‌డీటీల దృష్టికి తీసుకుని వెళ్లగా పరిశీలించి న్యాయం చేస్తామన్నారని తెలిపారు.

## చింతపల్లి బీచ్‌లో వేలాది మందితో యోగాంధ్ర



విజయనగరం రూరల్: విజయనగరం జిల్లా చింతపల్లి బీచ్లో 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేలాది మంది పాల్గొని యోగాసనాలు వేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నిత్య జీవితంలో యోగా భాగం కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. 'యోగాంధ్ర'లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

## రైతులకు అండగా కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



నరసన్నపేట (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి సంబంధించి రైతులను అన్ని విధాల ఆదుకునే విధంగా కృషి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. శుక్రవారం జలుమూరు మండలం చల్లవానిపేట పిఎసిఎస్ కార్యాలయం వద్ద రైతులకు రాయితీపై వరి విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సబ్సిడీపై వీటిని అందిస్తున్నామని ఈ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, జెడ్పీటీసీ ప్రతినిధి మెండ రాంబాబు, మండలపార్టీ అధ్యక్షులు వెలమల రాజేంద్రనాయుడు, సర్పంచులు దుంగ స్వామిబాబు, పంచిరెడ్డి రామచంద్రావు, బగ్గు గోవిందరావు, జలుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ తర్ర బలరాం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఖైరి భాస్కరరావు, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు మరియు ఎంపీడీవో, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాదర్బార్ నిర్వహించిన ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి




కురుపాం (చైతన్యరథం): ప్రజా సమస్యలు తెలుసుకుని ఆ సమస్యలు పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ మరియు కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం నాడు క్యాంప్ కార్యాలయం గుమ్మలక్ష్మీపురంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ ప్రజా దర్బార్‌కు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి ప్రజలు వచ్చి తమ సమస్యలు తెలుపుతూ వినతి పత్రాలు అందజేశారు. సమస్యలు విన్న ఎమ్మెల్యే వారి సమస్యల గురించి సంబంధిత అధికారులకు తెలియజేస్తూ వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. సమస్యలు త్వరగా పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మర్రాపు పురుషోత్తంనాయుడు, అంబటిరాంబాబు, సింహాచలం, పల్లా రాంబాబు, కలిసేటి కొండయ్య, తదితరులు ఉన్నారు.

## రైతున్న ఆందోళన వద్దు... అందుబాటులో ఎరువులు



రాష్ట్రంలో ఖరీఫ్‌కు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయశాఖ కమిషనర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. అన్ని పంటలకు అవసరమైన 16.76 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను పంపిణీ చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. యూరియా 6.22 లక్షల టన్నులు, డీఏపీ 2.60 లక్షల టన్నులు, ఎంఓపీ 0.70 లక్షల టన్నులు, యస్‌యస్‌పీ 0.94 లక్షల టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 6.30 లక్షల టన్నులు సిద్ధంగా ఉన్నాయన్నారు.

**రైతుల కోసం అందుబాటులో:** ఏప్రిల్ నాటికి 7.14 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మొత్తం 9.09 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను కో ఆపరేటివ్ సొసైటీలలో, ఆర్ఎస్?కేలలో, మార్క్ ఫెడ్ గోదాములలో, రిటైల్ హోల్ సేల్, కంపెనీ గోదాములలో రైతుల కోసం అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వీటితోపాటు జూన్ 2025 నెలకు రాష్ట్రానికి 2.35 లక్షల మెట్రిక్ టన్నులు కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. వీటి సరఫరాను రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షిస్తోందన్నారు. ఈ ఎరువులను కూడా సహకార సొసైటీలు, రైతు సేవ కేంద్రాలు, ప్రైవేట్ దుకాణాల ద్వారా గ్రామాల్లోని రైతులకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.

**విదేశాల నుంచి కూడా దిగుమతులు:** రాష్ట్రంలో ఇంతవరకు ఎక్కడా ఎలాంటి ఎరువుల కొరత లేదని దేశీయంగా ఉన్న అన్ని ఎరువుల కర్మాగారాలు ఉత్పత్తి చేస్తున్నాయని అలాగే విదేశాల నుంచి కూడా అవసరమైన ఎరువులు దిగుమతులు సంతృప్తి కరంగా ఉన్నాయని చెప్పారు. రాబోయే పంట కాలంలో కూడా ఎరువులకు ఎలాంటి కొరత రాదని స్పష్టం చేశారు. నానో యూరియా, నానో డీఏపీ ఎరువులను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. సంప్రదాయ ఎరువులకు 100 శాతం ప్రత్యామ్నాయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని ప్రోత్సహిస్తున్నాయని చెప్పారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు:** ఎరువులను కొనుగోలు చేసేటప్పుడు బస్తాపై ముద్రించిన ఎంఆర్‌పీ ధరలను రైతులు చూసుకుని, దాని ప్రకారం నగదు చెల్లించి రశీదు పొందాలని కోరారు. డీలర్లు ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి, ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, ఎరువులను మళ్లించినా, ఎంఆర్‌పీ ధరల కంటే ఎరువులను అధిక ధరలకు విక్రయించినా వారి యొక్క లైసెన్స్‌లు రద్దు చేసి, ఎరువుల నియంత్రణ చట్టం 1985 ప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఢిల్లీరావు హెచ్చరించారు.



## సమస్యల పరిష్కారానికి ఒక చక్కటి వేదిక... ప్రజాదర్బార్ : వేగుళ్ళ



మండపేట (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రజా సమస్యలకు సత్వర న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకుంటునట్లు రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఆయన నిర్వహించారు. ఈ వేదిక ద్వారా ప్రజల సమస్యల్ను ప్రత్యేకంగా వినడం, వాటికి పరిష్కార మార్గాలను సూచించడం ప్రభుత్వ లక్ష్యంగా భావించి ప్రజలకు సత్వర న్యాయం అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. వార్డులు, గ్రామాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. కరెంటు, భూ సమస్యలు, చర్చ్ నిర్మాణం, తాగునీటి సమస్యలు పై వినతులు అందాయి. అన్ని అంశాలపై సంబంధిత శాఖలతో సంప్రదించి తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం ఒక చక్కటి వేదిక అని అన్నారు.

## ఘనంగా మచిలీపట్నం మసులా బీచ్ ఫెస్టివల్ - 2025



కృష్ణా జిల్లా మచిలీపట్నంలో మసులా బీచ్ ఫెస్టివల్-2025 ఘనంగా ప్రారంభమైంది. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, మైన్స్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రలు బీచ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. తొలుత బీచ్ ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన గేట్ వే ఆఫ్ అమరావతి ఐకానిక్ టవర్‌ని మంత్రులు ప్రారంభించారు. అనంతరం 100 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు. బీచ్ ఫెస్టివల్‌కు పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఈ బీచ్ ఫెస్టివల్‌ను 4 రోజులపాటు నిర్వహించనున్నారు.

**బీచ్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: కందుల దుర్గేష్**

మంగినపూడి బీచ్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ఇక్కడికి వచ్చిన తరువాత చూస్తే చాలా సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ జెండాను 100 అడుగుల మేర ఆవిష్కరించడం ఆనందంగా ఉందని తెలిపారు. అఖండ గోదావరి కార్యక్రమం చేస్తున్నామని రూ.97 కోట్లతో సూర్యలంక బీచ్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి రాష్ట్రంలో 5 పర్యాటక రంగ అభివృద్ధికి ప్రాజెక్టులు ఇస్తామని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి హామీ ఇచ్చారని వెల్లడించారు. ఆ 5 ప్రాజెక్టుల్లో మచిలీపట్నం బీచ్‌ను పొందుపరుస్తామన్నారు. మంగినపూడి బీచ్ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

**ఫెస్ట్ నిర్వహించడం గర్వంగా ఉంది: కొల్లు రవీంద్ర**

మంగినపూడి బీచ్‌లో ఇంత పెద్ద ఫెస్ట్ నిర్వహించడం గర్వంగా ఉందని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. దక్షిణ భారత దేశంలోనే ఇది అతి పెద్ద ఫెస్ట్ అన్నారు. టూరిజం అభివృద్ధికి సీఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా అడుగులు వేస్తున్నామని అన్నారు. 2018లో బీచ్ ఫెస్టివల్ అత్యంత ఘనంగా నిర్వహించామని కానీ గత పాలకులు దీనిని నాశనం చేసారని మండిపడ్డారు. బీచ్‌లోకి రావడానికి కూడా లేకుండా అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీచ్ టూరిజం అభివృద్ధికి ఈ సభ ద్వారా తొలి అడుగు వేశామని అన్నారు. గేట్ వే ఆఫ్ అమరావతిగా బందరును మార్చేందుకు ఈ ఫెస్ట్ ద్వారా అడుగులు వేశామని మంత్రి కొల్లు తెలిపారు. అమరావతిలోని అసెంబ్లీ నమూనాను ఫెస్టివల్‌కు వచ్చేవారికి కనువిందు చేసేలా ఏర్పాటు చేశామని అన్నారు. 3 రోజుల పండుగలో అడ్వెంచర్ స్పోర్ట్స్, పారా గ్లైడింగ్, బీచ్ కబడ్డీ, బీచ్ వాలీ బాల్, కయాకింగ్ సహా అనేక ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. దేశంలో అన్ని రుచులు ఒకే చోట అందించబోతున్నామని మంత్రి తెలిపారు. హోటల్స్, రిసార్ట్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు.

## సామర్లకోటలో యోగాసనాలు వేసిన మాజీమంత్రి చినరాజప్ప



కాకినాడ జిల్లా సామర్లకోట కుమార భీమేశ్వరస్వామి దేవస్థానం నందు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర 2025 కార్యక్రమంలో పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప ఆసనాలు వేశారు. యోగా ఆరోగ్యానికి చాలా మంచిదని యోగాను ప్రతి ఒక్కరూ వారి జీవితాల్లో భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముగిసిన ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్

**•విజేతలకు బహుమతి ప్రధానం చేసిన మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు**



మైలవరం (చైతన్యరథం): చెరుకూరి నరసింహారావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి కృష్ణాజిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిశాయి. ఈ పోటీలలో ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి 62 జట్లు తలపడగా విజేతలుగా అమ్మా క్యారెట్స్, పోరంకి, రన్నర్స్ గుంటుపల్లి యూత్ సీసీ జట్లు నిలిచాయి. వీరికి బహుమతి ప్రధానం ట్రోఫీని కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలుగుదేశం పార్టీ నేత మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కీర్తిశేషులు చెరుకూరి నరసింహయ్య ఈ ప్రాంత ప్రజలకు సుపరిచితులని ఆయన గతంలో శాసనసభ్యులు మంత్రులు దగ్గర నుండి నిధులను మంజూరు చేయించి గ్రామాభివృద్ధిలో ఎంతగానో తోడ్పడ్డారని, మౌలిక వసతుల కల్పనలో ఆయన చేసిన కృషి మరువలేనిదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సూర్యచంద్రులు ఉన్నంతకాలం నరసింహయ్య ఈ ప్రాంత ప్రజల మదిలో చిరస్థాయిగా ఉంటారని కొనియాడారు. చెరుకూరి నరసింహారావు మెమోరియల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న కుమారులు చిన్న వెంకయ్య, వెంకట్రావులను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ప్రతిభ కనబరిచిన క్రీడా కారులకు మెడల్స్, ప్రోత్సాహక బహుమతులు అందించారు. చదవుతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నేతలు గుంటుపల్లి తెలుగు యువత పాల్గొన్నారు.

## దివ్యాంగులకు అండగా నిలిచిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్

**•వైకల్యం నిర్ధారణ పరీక్షలకు సూదర ప్రాంతాల నుంచి ఏలూరుకు వచ్చిన వారికి భోజనం, వసతి కల్పన**



ఏలూరు (చైతన్యరథం): దేశ రాజధాని ఢిల్లీలో ఉన్నా.. గల్లీలో ఉన్నా తన సాయం కోరి వచ్చే వారికి ఎల్లప్పుడు అండగా ఉంటారని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మరోసారి నిరూపించారు. ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గం కుక్కునూరు మండలానికి చెందిన 30 మంది దివ్యాంగులు వైకల్యం నిర్ధారణ పరీక్షల నిమిత్తం ఆన్లైన్ సదరంలో స్లాట్ బుక్ చేసుకోగా ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి స్లిప్పులు జారీ అయ్యాయి. అయితే ఇక్కడి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు వైకల్య పరీక్షలకు జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. జిల్లా కేంద్రమైన ఏలూరుకు సుమారు 150 కిలోమీటర్ల దూరభారం నుంచి వచ్చిన దివ్యాంగులు దిక్కుతోచని స్థితిలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కార్యాలయాన్ని సంప్రదించారు. తక్షణం స్పందించిన ఎంపీ కార్యాలయం ప్రతినిధులు సదరం శిబిరానికి వెళ్లి దివ్యాంగులకు తక్షణం పరీక్షలు నిర్వహించేలా అధికారులతో మాట్లాడి మండు వేసవిలో దివ్యాంగులు జంగారెడ్డిగూడెం వెళ్లకుండా ఏలూరులోని వైకల్యం నిర్ధారణ పరీక్షలు చేయించారు. వైకల్యం నిర్ధారణ పరీక్షల అనంతరం తమ స్వగ్రామాలకు దివ్యాంగులు తిరుగు ప్రయాణం కాగా భోజనం సమయం కావడంతో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆదేశాలతో కార్యాలయం ప్రతినిధులు భోజనం వసతి కల్పించారు. మండుటెండలో వచ్చిన దివ్యాంగులు భోజనం చేసిన అనంతరం ఎంపీ కార్యాలయంలో కొద్దిసేపు సేదతీరి తిరిగి పయనమయ్యారు. తాము ఫోన్ చేసి సంప్రదించగానే తక్షణం స్పందించి తమకు సేవలందించిన ఎంపీ కార్యాలయం ప్రతినిధులకు దివ్యాంగులు కృతజ్ఞతలు తెలియజేశారు. మారుమూల ప్రాంతం నుంచి వచ్చిన తమను అక్కున చేర్చుకున్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు దివ్యాంగులు ధన్యవాదాలు తెలిపారు.

## కూటమి పాలనపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్న వైసీపీ నేతలు

**• అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించిన బండారు సత్యనారాయణ**



కొత్తపేట (చైతన్యరథం): కూటమి ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా వైసీపీ నాయకులు పనిచేస్తున్నారని, రెచ్చగొట్టి రాష్ట్రంలో అశాంతి నెలకొనేలా ప్లాన్ చేస్తున్నారని, అందరూ అప్రమత్తంగా వ్యవహరించి వైసీపీ నేతలకు ఎక్కడికక్కడ తగిన గుణపాఠం చెప్పాలని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ పిలుపునిచ్చారు. ప్రజల్లో అనుమానాలు రెకెత్తించి ఆందోళన కార్యక్రమాలు చేపట్టి ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారని, నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే, జిల్లా వైసీపీ అధ్యక్షుడు మరోముందుకు వేసి తనపై వ్యక్తిగతంగా బురదజల్లడానికి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ప్రజలు విచక్షణతో అన్ని పరిశీలిస్తున్నారని, వైసీపీ నేతలు బురద మాటలకు విలువ లేదన్నారు. ప్రభుత్వ పాలన, అభివృద్ధి, సంక్షేమాన్ని ఎన్డీఏ కూటమి పార్టీలు ప్రజల్లో విస్తృతంగా తీసుకు వెళ్ళాల్సి ఉందని బండారు సత్యనారాయణ పిలుపునిచ్చారు.

## నరసరావుపేటలో ప్రజా సమస్యల ప్రజావేదిక పాల్గొన్న ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ప్రజావేదిక కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట శాసనసభ్యులు చదలవాడ అరవిందబాబు నియోజకవర్గంలోని ప్రజల వద్ద నుండి వినతి పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రజా వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రతి శుక్రవారం నియోజకవర్గం టీడీపీ కార్యాలయం నందు ప్రజల సమస్యలు తెలుసుకొనుటకు ప్రజా వేదిక నిర్వహిస్తున్నామని ప్రజా వద్ద నుండి పెద్ద ఎత్తున వినతి పత్రాలు వస్తున్నాయని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా ప్రభుత్వం పని చేస్తుందని నియోజకవర్గ ప్రజల సమస్యలు తెలుసుకొని సంబంధిత అధికారుల ద్వారా సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో టీడీపీ జనసేన కూటమి నేతలు పాల్గొన్నారు

# ప్రజలకు, ప్రభుత్వానికి వారధి ప్రజాదర్బార్ : ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): ప్రజా దర్బార్ పేద ప్రజల సమస్యల పరిష్కారానికి వారధిగా నిలుస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. శుక్రవారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే వారి కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను సావధానంగా ఆలకించారు. ఇంటి స్థలాలు, రేషన్ కార్డులు, మురుగునీరు, వ్యక్తిగత సమస్యల కోసం ఎక్కువ అర్జీలు ప్రజలు సమర్పించారు. ప్రతి సమస్యకూ పరిష్కారం చూపిస్తామని, వెంటనే అధికారులకు ఆదేశాలు ఇస్తామని ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు. గతంలో రేషన్ కార్డుల కిఒసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ అర్హతను బట్టి మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు.. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కేవలం ప్రజాదర్బార్ రోజునే కాకుండా సమస్యలు ఉంటే తనను ఎప్పుడైనా కలవచ్చని సూచించారు. వృద్ధులు పింఛన్లు కోసం అర్జీలు అందజేశారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం లో కేవలం 10 నెలల కాలంలోనే సీసీ డ్రెయిన్లు, రోడ్లు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. గత ఐదేళ్ల కాలంలో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వివిధ కారణాలను అడ్డుపెట్టి పింఛన్లకు ఎసరు పెట్టారని, రేషన్ కార్డులు తీసేశారని వివరించారు. అర్హతను బట్టి వీరందరికీ తిరిగి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే నసీర్ వెల్లడించారు.

# గుడివాడ ప్రజాదర్బార్‌లో సమస్యలపై వినతులు

## పరిష్కరించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదేశం



గుడివాడ(చైతన్యరథం): ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శుక్రవారం గుడివాడ ప్రజాదర్బా ర్‌లో పాల్గొ న్నారు. సమస్యలపై ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. గుడివాడ 11వ వార్డుకు చెందిన ఖయ్యూం అనే దివ్యాంగుడికి గత ప్రభుత్వ తప్పిదంతో రేషన్‌కార్డులో పేరు తొల గించడంతో వారు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే తన కార్యాలయ సిబ్బంది ద్వారా రేషన్‌కార్డులో పేరు నమోదుకు దరఖాస్తు చేయించి సమస్యను పరిష్కరించి పత్రాలను ఖయ్యూం కుటుంబసభ్యులకు అందజేశారు. రూరల్ మండలం బొమ్మలూరు గ్రామంలో డ్రైనేజీ, పరిసరాల అపరిశుభ్రత, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, తాగునీటి సమస్యలపై పలువురు అర్జీలు అందజేశారు. సమస్యల తాత్కాలిక పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతామని. వారంలోపు బొమ్మలూరు గ్రామంలో అధికారులతో కలిసి పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడ తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

**సీఎంఆర్ఎఫ్ మంజూరు చేయించండి**

సీఎం రిలీఫ్ ఫండ్ కింద సహాయం అందించాలని నందివాడ మండలం జొన్నపాడు గ్రామానికి చెందిన శివప్రసాద్, రూరల్ మండలం లింగవరం గ్రామానికి చెందిన వెంకట శివలక్ష్మి విజ్ఞప్తి చేశారు. బాధితుల చికిత్సల వివరాలను అడిగి తెలుసుకున్న ఎమ్మె ల్యే సంబంధిత పత్రాలు అందిస్తే మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎలక్ట్రికల్ యూనియన్ కార్యాలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని అధ్య క్షుడు తాళ్లూరి పెద్ద నాగేశ్వరరావు, సెక్రటరీ పెనుమూడు నాగేశ్వరరావు వినతిపత్రం అందజే శారు. టిడ్కో కాలనీలో మూడో అంతస్తులో ఫ్లాట్ మంజూరు అయిందని.. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఇవ్వాలని 67 ఏళ్ల వృద్ధురాలు బి.కృష్ణజ్యోతి వినతిపత్రం అందజేశారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్ తొలగించారు**

పేదలమైన తమకు ఆదాయ పన్ను జాబితాలో ఉన్నారంటూ ఫీజు రీయింబర్స్‌మెంట్ తొలగించారని గుడివాడ యానాదుల కాలనీకి చెందిన కె.కనకరాజు ఆవేదన వ్యక్తం చేశాడు. తమ కుటుంబంలో ఎవరూ పన్ను చెల్లించడం లేదని.. తమకు న్యాయం చేయా లని వినతిపత్రం అందజేశారు. జొన్నపాడు విష్ణు విలాసం ఎస్టేట్స్‌లో విద్యుత్ సమస్య లపై స్థానికురాలు యార్లగడ్డ విమల, ఏడో వార్డు ఒకటో రోడ్డులో సగం ఇళ్లకు తాగు నీరు రావడంలేదని స్థానికుడు ఏడుకొండలు, గుడివాడ పట్టణంలోని 11వ వార్డు, 14వ వార్డు, మళ్ళాయిపాలెం తదితర ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై స్థానికులు వినతిపత్రాలు అందజేశారు. సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే రాము సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిష్కరించాలని సూచించారు.

# ఉపాధి హామీ పెండింగ్ నిధులు విడుదల పట్ల హర్షం

**●విజిలెన్స్ విచారణలో నిలిచిపోయిన బిల్లులకు నిధులు విడుదల చేయాలి**

**●రాష్ట్ర ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముక్కు గురుమూర్తి.. లక్ష్మీసుభాషిణి వినతి**



అమరావతి (చైతన్యరథం): కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉపాధి హామీ పథకానికి సంబంధించిన పెండింగ్ నిధులు విడుదల చేయడం పట్ల రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్, రాష్ట్ర ఉ పాధి హామీ మండలి మాజీ సభ్యులు వీరంకి వెంకటగురుమూర్తి, మొవ్వా లక్ష్మీ సుభాషిణిలు హర్షం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి కేంద్రం నుంచి రావాల్సిన మెటీరియల్, అడ్మిన్ నిధులు రూ. 1,136 కోట్లు రాష్ట్రానికి మంజూరయ్యాయి, మెటీరియల్ నిధులు రూ.960.15 కోట్లు, అడ్మిన్ నిధులు రూ.176.35 కోట్లు మంజూరు చేస్తూ కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్, రాష్ట్ర ఉపాధి హామీ మండలి మాజీ సభ్యులు వీరంకి వెంకటగురుమూర్తి, మొవ్వా లక్ష్మీ సుభాషిణిలు రాష్ట్ర ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముఖ్ను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. పెండింగ్ బిల్లులతోపాటు ఉపాధి హామీ పథకానికి సంబంధించిన పలు అంశాలు, సమస్యలను వివరించి విజిలెన్స్ విచారణలో నిలిచిపోయిన నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా గురుమూర్తి, సుభాషిణి లు మాట్లాడుతూ.. 2014-19 సంవత్సరాల్లోను పెండింగ్ బిల్లులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, విజిలెన్స్ విచారణ మరియు 21 శాతం, 6 శాతం నిలుపుదల చేసిన నిధులు సైతం విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామీణ ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముఖ్ సానుకూలంగా స్పందించారని, ఆన్ గోయింగ్ లో ఉండిఆన్లైన్లో అప్లోడ్ అయిన, పనులకు సంబంధించిన నిధులు తక్షణం విడుదల చేస్తామని, అలాగే, క్లోజ్డ్ మోడ్‌లో ఉన్న ఎఫ్.టీ.వోలను ఆన్ గోయింగ్లోకి తీసుకురావటానికి కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నామని, సంప్రదింపులు పూర్తయిన తరువాత సంబంధిత నిధులు కూడా త్వరలో విడుదల చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, రాష్ట్ర గ్రామీణ ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముఖ్ హామీ ఇచ్చినట్టు రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్, రాష్ట్ర ఉపాధి హామీ మండలి మాజీ సభ్యులు వీరంకి వెంకటగురుమూర్తి, మొవ్వా లక్ష్మీసుభాషిణి అన్నారు.

# జర్నలిజంలో నైతిక విలువలు పాటించే పాత్రికేయుల్లో సురేష్ ఒకరు

**●అమరావతి రైతుల ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబుకి కృతజ్ఞత సభ**

**●ముఖ్యఅతిథులుగా పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు, ఎంపీ కేశినేని**



విజయవాడ (చైతన్యరథం): జర్నలిజంలో నైతిక విలువలు పాటిస్తూ... వాటిని కాపాడేందుకు పోరాటం చేసే అతికొద్ది మంది పాత్రికేయుల్లో ఆలపాటి సురేష్ ఒకరు. విధ్వంసం పుస్తకం ప్రచురించక ముందు నుంచే సురేష్ అమరావతి రాజధాని కోసం పోరాటం చేశారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ కొనియాడారు. ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా ఆలపాటి సురేష్, ప్రభుత్వ సలహాదారుడిగా అహ్మద్ షరీఫ్, ఏపీ మహిళ కమిషనర్ రాయపాటి శైలజను నియమించినందుకు సీఎం చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలుపుతూ అభినందన సభ కార్యక్రమం అమరావతి రైతుల ఆధ్వర్యంలో గురువారం ఎ ప్లస్ కన్వేషన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులు డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు, ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... ఆలపాటి సురేష్‌కి ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషంగా వుందన్నారు. ప్రెస్ అకాడమీ విలువలు కాపాడే సమర్థత, సామర్థ్యం వున్న సురేష్‌కి ఈ పదవీ కేటాయించినందుకు సీఎం చంద్రబాబుకి ధన్యవాదాలు తెలిపారు. పాత్రికేయ రంగంలో ఎంతో అనుభవం వున్న సురేష్ ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించటంతోపాటు వారి అభ్యున్నతి కోసం తప్పక కృషి చేస్తారన్నారు. అలాగే తాము పదవుల్లో వుండటానికి కారణం అమరావతి రైతులు పోరాటమే కారణమన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయింది. అమరావతి రైతుల కృషి వల్లే ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడును అధికారంలోకి తీసుకువచ్చి, ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని అమరావతిని సజీవంగా నిలబట్టేందుకు పోరాడిన అమరాతి రైతులకు రాష్ట్ర ప్రజలందరూ మీకు రుణపడి వుంటారన్నారు. రాబోయే మూడేళ్లలో అమరావతి రాజధాని ఫలాలు ప్రజలందరికీ అందబోతున్నాయని తెలిపారు. అమరావతి రాజధాని కోసం మహిళలు చేసిన పోరాటం చరిత్ర కూడా మర్చిపోలేదన్నారు. ఈకార్యక్రమంలో అమరావతి రైతులతో పాటు ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డివిజన్‌లో శానిటేషన్ నిర్వహణ అధ్వానం

**●ఎమ్మెల్యే గళ్ళా మాధవికి ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలు**




గుంటూరు (చైతన్యరథం): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అనేక డివిజన్లలో శానిటేషన్ నిర్వహణ చాలా అధ్వానంగా ఉందని, సంబంధిత అధికారులకు చర్యలు తీసుకోవాలని టిడిపి నేతలు ఎమ్మెల్యే గళ్ళా మాధవికి ఫిర్యాదు చేశారు. శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల అర్జీలు స్వీకరించి, వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే గల్లా మాధవి ఆదేశాలు జారీ చేశారు. తొలుత టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సుఖవాసి శ్రీనివాసరావు జన్మదినాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కేక్ కట్ చేసి ఆయనకు తినిపించి శు భాకాంక్షలు తెలిపారు. టీటీ అకాడమీకి చెందిన విద్యార్థులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి "బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్లు" అందించారు. అదే విధముగా శ్రీలక్ష్మి నగర్, ఉద్యోగ నగర్‌లో సీసీ డ్రైన్లు, రోడ్లు నిర్మించాలని, గుడి నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఉద్యోగ నగర్ కాలనీ వెల్ఫర్ అండ్ డెవలప్మెంట్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే గళ్ళా మాధవికి వినతిపత్రం అందజేశారు.

అదేవిధంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ఉన్న రజక వృత్తిదారుల కోసం శుభకార్యాలు చేసుకోవటానికి "కమ్యూనిటీ హాల్" నిర్మించాలని వినతి పత్రం అందజేశారు. ఆర్.యం.పి మరియు పిఎంపీ వైద్యులను హెల్త్ ప్రొవైడర్లుగా గుర్తిస్తూ జీవో నెంబర్ 46ను పునరుద్ధరించవలసిందిగా కోరారు. వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీనిచ్చారు.

# వేమిరెడ్డి ప్రశాంతి గురించి మాట్లాడే అర్హత నీకు లేదు ప్రసన్నా..

●వెన్నుపోటుకు కేరాఫ్ రాష్ట్రంలో జగన్, జిల్లాలో ప్రసన్న

●తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన టీడీపీ నేత జీవీఎం శేఖర్ రెడ్డి



కోవూరు (చైతన్యరథం): ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గురించి మాట్లాడే కనీస అర్హత ప్రసన్న కుమార్‌రెడ్డికి లేదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నేత జీవీఎల్ శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నల్లపురెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఇటీవల వరకు ఉంటూ ఇటీవల తెలుగుదేశం పార్టీలో చేరిన నాయకుల పట్ల ప్రసన్నకుమార్‌రెడ్డి రెడ్‌లైట్ ఏరియాలో అమ్ముడుపోయినట్లు అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. ఒక్క రూపాయి కూడా తీసుకోకుండానే ప్రసన్నకుమార్ రెడ్డి వైఖరి పట్ల విసిగి వేసారి అనేకమంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు వేమిరెడ్డి ప్రశాంతమ్మ సమక్షంలో టిడిపిలో చేరారన్నారు. ప్రసన్న కుమార్‌రెడ్డికి దమ్ముంటే అమ్ముడుపోయినట్లు నిరూపించాలన్నారు. కాణిపాకంలో ప్రమాణం చేద్దాం రా అంటూ శేఖర్‌రెడ్డి సవాల్ చేశారు. రాజుపాలెంలో గత ఎన్నికలకు ముందు శివుడికి పూజల పేరుతో పాటు అనేక సమయాల్లో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతి రెడ్డి దగ్గర నుంచి కోట్ల రూపాయలు చందా తీసుకొని పూజలు చేసిన ఘనత ప్రసన్నకుమార్ రెడ్డికి దక్కిందన్నారు ఆ సమయంలో వేమిరెడ్డి దంపతులను శివపార్వతులని కొనియాడి కాళ్లకు మొక్కుకున్నాడని కానీ నేడు నోటికి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. హైదరాబాదులో నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కట్టిన భవనాలు పేద ప్రజల అమ్ము కాదా అంటూ ప్రశ్నించారు. ప్రసన్న కుమార్ రెడ్డి ఏం వ్యాపారం చేసి పెద్దపెద్ద భవంతులు కట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. పేద ప్రజల రక్తం తాగే ప్రసన్నకుమార్‌రెడ్డి నీతులు చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించడమేనని విమర్శించారు.

# డీఎస్సీ అభ్యర్థులకు మజ్జిగ పంపిణీ

●టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రారంభం... పాల్గొన్న కొట్టే హేమంత్ రాయల్



తిరుపతి(చైతన్యరథం): నగరంలోని టాటా ఐకాన్ డిజిటల్‌లో ఏర్పాటు డీఎస్సీ పరీక్ష కేంద్రం దగ్గర టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్ ఆధ్వ ర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చంద్రబాబు మొట్టమొదటి సంతకం డీఎస్సీ నోటిఫికేషన్ మీదనే చేశారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వంలో మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో డీఎస్సీ నోటిఫికేషన్ తూతూ మంత్రంగా విడుదల చేసి ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి నిరుద్యోగ ఆంధ్రగా మార్చేశారన్నారు. నాడు - నేడు అనే పేరుతో వైసీపీ నాయకులకే కాంట్రాక్టులు కేటాయిస్తూ నాణ్యతా లోపంగా పాఠశాల భవనాలను నిర్మిం చారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నందకిషోర్, జశ్వంత్, జ్ఞానేష్, శ్రీను, అరవిం ద్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# కడపలో రూ.13 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన రెడ్డప్పగారి మాధవి



కడప నియోజకవర్గంలో సీఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరైన రూ.12,99,807 విలువైన 18 చెక్కులను లబ్ధిదారులకు పొలిట్‌బ్యూరో సభ్యులు, కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి మరియు రాష్ట్ర ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి అందజేశారు. సమస్యల్లో ఉన్న కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలిచేలా సీఎం రిలీఫ్ ఫండ్‌ను ప్రజల కోసం వినియోగిస్తున్న తెలుగుదేశం ప్రభుత్వం, ప్రజాక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. పేదలకు సీఎంఆర్ఎఫ్ ఒక అండగా నిలుస్తుందని, అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటున్న వారికి రిలీఫ్ ఫండ్ నిధులు ఎంతో ఉపయోగపడుతున్నాయని, రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని వైసీపీ పాలనలో ఒక్కరి కూడా రిలీఫ్ ఫండ్ ఇవ్వలేదన్నారు.

# చివరి దశకు చేరుకున్న విఆర్సీ హై స్కూల్ ఆధునీకరణ పనులు

●వి.ఆర్ హైస్కూల్లో జరుగుతున్న పనులను పరిశీలించిన పొంగూరు శరణి

●పేద విద్యార్థులకు ఇంటరాక్టివ్, డిజిటల్ విద్యను అందించడమే లక్ష్యం



నెల్లూరు (చైతన్యరథం): పేద విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించాలని మహా సంకల్పంతో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ సంకల్పించిన వి.ఆర్ హైస్కూల్ ఆధునీకరణ పనులు చివరి దశకు చేరుకున్నట్లు మంత్రి నారాయణ కుమార్తె పొంగూరు శరణి తెలిపారు. కార్పొరేట్ స్కూల్స్ ని తలదన్నేలా సిద్ధమౌతున్న పేదపిల్లల పాఠశాల వి ఆర్ హైస్కూల్‌ను ఆమె పరిశీలించారు. పనుల పురోగతిని అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి తరగతి గదికి వెళ్లి ఏర్పాటు చేసిన వసతులను, ఫర్నిచర్‌ను, ప్లే గ్రౌండ్‌ను పరిశీలించారు. పనులు నాణ్యవంతంగా వేగంగా చేస్తున్న ఎన్సిసి సిబ్బందిని ఆమె అభినందించారు. ఈ సందర్భంగా పొంగూరు శరణి మాట్లాడుతూ... వెంకటగిరి రాజా సహాయంతో విఆర్సీని అభివృద్ధిచేసారన్నారు. 1975లో మహోన్నత ఉద్దేశంతో ఏర్పాటు చేసిన విఆర్సీకి గొప్ప చరిత్ర ఉందని తెలిపారు. ఎంతోమంది ప్రజాప్రతినిధులను, వ్యాపారవేత్తలను, మేధావులను సమాజానికి అందించిందన్నారు. అంతటి చరిత్ర ఉన్న వీఆర్సీ హై స్కూల్‌ను వైఎస్సార్సీపీ హయాంలో మూత వేయడం దౌర్భాగ్యమని మండిపడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి లోకేష్ సహకారంతో వీఆర్సీ పునః ప్రారంభానికి మా నాన్న నారాయణ సంకల్పించారని తెలియజేశారు. ఆ మేరకు ఆధునీకరణ పనుల బాధ్యత తనకు అప్పగించారని చెప్పారు. పేద విద్యార్థులకు ఇంటరాక్టివ్, డిజిటల్ విద్యను ఈ ఏడాది నుంచి అందించబోతున్నట్లు వెల్లడించారు. ఏపీని డిజిటల్ ఇండియా చేయాలన్నది మంత్రి లోకేష్‌బాబు ఆశయం అని తెలియజేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో దేశంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఇంటర్ నేషనల్ స్కూల్స్ లో ఉండే స్టాండర్డ్స్ ఇక్కడ ఉంటాయని చెప్పారు. పీ-4 కింద ఇరవై మంది విద్యార్థుల కుటుంబాలను దత్తత తీసుకొంటున్నానని ప్రకటించారు. పేదపిల్లల కోసం జరుగుతున్న యజ్ఞంలో భాగస్వామిని కావటం అదృష్టంగా భావిస్తున్నానని హర్షం వ్యక్తం చేశారు.

# రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేసిన గౌరు చరితరెడ్డి



పాణ్యం (చైతన్యరథం): నియోజకవర్గంలోని పాణ్యం గ్రామానికి చెందిన తెలుగుదేశంపార్టీ కార్యకర్త తోట రామాంజి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమనిధి నుంచి రూ.5లక్షల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి అందజేశారు. ఆపదలో ఉన్న కార్యకర్తల కుటుంబాలను ఆదుకునేందుకు మంత్రి నారా లోకేష్ తీసుకొచ్చిన కార్యకర్తల సంక్షేమనిధి ఎంతో మంది పేదలకు బాసటగా నిలుస్తుందన్నారు. రూ.100తో సభ్యత్వం తీసుకున్నవారికి రూ.5 లక్షల ప్రమాద బీమా కల్పిస్తున్న ఏకైక పార్టీ టీడీపీ అని అన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం టీడీపీ పనిచేస్తుందని, రోడ్డు ప్రమాదంలో మరిణించిన తోట రామాంజి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని గౌరు చరితరెడ్డి వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గీత కార్మికుడి కుటుంబాన్ని ఆదుకుంటాం

●ఫైనాన్స్ కంపెనీ వేధింపుల వల్లే రత్తయ్య బలవన్మరణం

●బాధిత కుటుంబసభ్యులకు పరామర్శలో ఎమ్మెల్యే సురేష్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ 'వీరంకి'



జలదంకి, నెల్లూరు (చైతన్యరథం): ఫైనాన్స్ కంపెనీల ఆగడాలు రోజురోజుకు శృతి మీరుతున్నాయని, ఫైనాన్స్ కంపెనీ ఒత్తిడిని తట్టుకోలేక, ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతూ గీతకార్మికుడు బలవర్మణం పాలవటం అత్యంత బాధాకరమని, దురదృష్టకరమని, బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్, రాష్ట్ర గౌడ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తిలు భరోసా ఇచ్చారు. నెల్లూరు జిల్లా కలిగిరి మండలం భట్టువారిపాలెంకు చెందిన కొమరా రత్తయ్య (38) ఫైనాన్స్ కంపెనీ ఒత్తిళ్లను తట్టుకోలేక సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జలదంకి మండలం, చామదల పంచాయితీ పరిధిలోని వేణుగోపాలపురంకు చెందిన రత్తయ్య కుటుంబం 30 ఏళ్ల క్రితం భట్టువారిపాలెంకు వలస వచ్చి కల్లుగీత వృత్తి సాగిస్తూ జీవనం సాగిస్తున్నాడు. రత్తయ్యకు భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు సంతానం ఉన్నారు. ఈ క్రమంలో కుటుంబ ఆర్థిక అవసరాల దృష్ట్యా మూడేళ్ల క్రితం రత్తయ్య ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో రూ.3.25లక్షలు వాయిదాల పద్ధతిలో చెల్లించేందుకు అప్పుగా తీసుకున్నాడు. కొంతకాలం సకాలంలో వాయిదాలు చెల్లిస్తూ వచ్చాడు. తన భార్యకు ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం కావటంతోపాటు కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగా మారడంతో ఎనిమిది నెలలుగా రత్తయ్య వాయిదాలు చెల్లించలేదు. దీంతో ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది రత్తయ్యపై ఒత్తిడి చేశారు. అంతటితో ఆగక అతని ఇంటి గోడపై తమ కంపెనీకి రత్తయ్య బాకీ ఉన్నట్టు నోటీసులు అంటించారు. వాయిదా చెల్లించాల్సిందేనంటూ పట్టుబట్టారు. ఈ క్రమంలో తన నివాసానికి సమీపంలో ఉన్న బంధువైన వృద్ధురాలి పెన్షన్ రూ.4 వేలు, ఆమె తనయుడు వద్ద రూ.2 వేలు అప్పు తీసుకుని ఫైనాన్స్ సిబ్బందికి చెల్లించాడు. అయినా, మిగిలిన నగదు చెల్లించాలంటూ సిబ్బంది మరింత ఒత్తిడి తీసుకురావటంతో తీవ్ర మనోవేదనకు గురైన రత్తయ్య తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రత్తయ్య మృతదేహాన్ని కుటుంబసభ్యులు, బంధువులు స్వగ్రామం వేణుగోపాలపురంకు తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ మేరకు సమాచారం తెలుసుకున్న ఉదయగిరి ఎమ్మెల్యే సురేష్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తిలు శుక్రవారం వేణుగోపాలపురం వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. రత్తయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఫైనాన్స్ కంపెనీ వేధింపుల వల్లే రత్తయ్య బలవన్మరణం చెందాడని, ఫైనాన్స్ కంపెనీ వ్యవహారశైలిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కాకర్ల ట్రస్ట్ తరఫున కాకర్ల సురేష్ రూ.50 వేలు రత్తయ్య కుటుంబానికి తనవంతు సాయంగా గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి రూ.25 వేలు, గౌడ సంక్షేమ సంఘం తరఫున రూ.75 వేలు వెరసి రూ. 1లక్ష రత్తయ్య కుమార్తె పేరున బ్యాంకులో వెంటనే ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని భరోసా ఇచ్చారు. అలాగే, విషయాన్ని సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి పార్టీపరంగా, ప్రభుత్వపరంగా కుటుంబానికి ఆర్థికసాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

# మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

● తల్లికి వందనం అన్నదాత సుఖీభవ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలను త్వరలోనే ప్రారంభిస్తాం : ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి



పుట్టపర్తి (చైతన్యరథం): త్వరలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలతో పాటుగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాలు కల్పిస్తామని కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం అయినప్పటికీ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్రాన్ని విజయవంతంగా ముందుకు నడిపిస్తున్నారని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని తూచా తప్పకుండా అమలు చేస్తామని, విషం చిమ్మే వైసీపీ నాయకుల మాయ మాటలు ఎవరు నమ్మకూడదని అన్ని పథకాలను అమలు చేసి సమర్థమైన పాలన అందించడంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందని ఎమ్మెల్యే తెలియజేశారు. శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గ పరిధిలోని కొత్తచెరువు మండలంలోని ఎస్ఎల్వి ఫంక్షన్ హాల్‌లో గూడా చలపతి కుమార్తె వివాహ శుభకార్యానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, అనంతరం ఆమడగూరు మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన కోనపల్లి వారి వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులైన లవన్ కుమార్‌రెడ్డి, శ్వేతాలను ఆశీర్వదించారు.

# కాకా హెటల్‌లో అల్పాహారం రుచిచూసిన మంత్రి ఎస్.సవిత



గోరంట్ల (చైతన్యరథం): అధికార మత్తు తలకెక్కితే తన.. మన అనే భేదం ఉండదు. అహంకారంతో.. వెన్నంటి నిలిచి తన ఉన్నతికి జీవితాలను ధారబోసిన వారిని సైతం తృణప్రాయంగా త్యజిస్తారు కొందరు ప్రబుద్ధులు... ఇంకొందరు మాత్రం ఎంత ఎదిగినా ఒదిగే ఉంటారు.. అధికారాన్ని సేవగా భావిస్తారు. ఈ కోవలోకే వస్తారు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత. మంత్రిగా బాధ్యతలు చేపట్టినా... చుట్టూ మందీమార్బలం ఉన్నా... తనవారికి, తనను అందలం ఎక్కించిన నియోజకవర్గవాసులకు మంత్రి సవిత ఎన్నడూ దూరం కాలేదు. సమయం దొరికిన ప్రతిసారీ అక్కా... అన్నా... అంటూ ఆప్యాయంగా వాళ్ల ఇళ్లకి వెళ్లి... వారి కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటూ అందరితోనూ మా సవితమ్మ... మా రామచంద్రారెడ్డి బిడ్డ... అని దీవెనలు అందుకుంటున్నారు. శుక్రవారం ఉదయం సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామానికి వస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు స్వాగతం పలుకడానికి మంత్రి సవిత వచ్చారు. కేంద్రమంత్రి రావడానికి ఇంకా సమయం ఉండడంతో, రోడ్డు పక్కనే ఉన్న చిన్న హెటల్‌కు వెళ్లారు. మంత్రిని అనే అహం చూపకుండా అందరితో కలిసి టిఫిన్ చేశారు. అన్నా... వ్యాపారం బాగుందా... కూటమి ప్రభుత్వమిస్తున్న ఉచిత గ్యాస్ అందుతుందా..? అంటూ హెటల్ యజమానిని ఆప్యాయంగా పలకరించారు. అక్కడ టిఫిన్ చేస్తున్నవారితోనూ మాట్లాడారు. స్వయాన రాష్ట్ర మంత్రి తమ హెటల్‌కు వచ్చి టిఫిన్ చేయడమే కాకుండా యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటుంటే, ఆ హెటల్ యజమాని, ఆయన సతీమణితో పాటు స్థానికులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. మంత్రి హెదాలో ఉన్న కూడా సవిత సింప్లిసిటీని చూసి.. మా సవితమ్మ సూపర్ అంటూ పొగడకుండా ఉండలేకపోయారు. ఎంత ఎదిగినా మా సవితమ్మ మారలేదంటూ ఉప్పొంగిపోయారు.

# కేంద్రమంత్రి నిర్మల సీతారామ్‌కు నేతల స్వాగతం



శుక్రవారం పెనుగొండ నియోజకవర్గం గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద నాసిన్ కేంద్రంలో పలు కార్యక్రమాలలో పాల్గొనటానికి విచ్చేసిన కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్‌ని మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికె పార్థసారథి, బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి, కలెక్టర్ చేతన్ తదితరులు ఉన్నారు.

# రాప్తాడు నియోజకవర్గంలో పరిటాల బ్రాండ్ శాశ్వతంగా ఉండేలా చేస్తాం

● మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమాణస్వీకారోత్సవంలో ఎమ్మెల్యే పరిటాల సునీత

● రైతులకు నిరంతరం అందుబాటులో ఉండాలన్న పరిటాల శ్రీరామ్



రాప్తాడు (చైతన్యరథం): నియోజకవర్గ అభివృద్ధి పరిటాల అనే బ్రాండ్ శాశ్వతంగా ఉండేలా పని చేస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడు మార్కెట్ యార్డ్ చైర్మన్‌తో పాటు ఇతర కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా సాగింది. ఈ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్‌కు రాప్తాడు సమీపంలోనే టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. భారీ గజమాలలు వేసి తమ అభిమానం చాటుకున్నారు. అనంతరం అక్కడి నుంచి భారీ ఊరేగింపుగా కక్కలపల్లి టమోటా మార్కెట్ వరకు వచ్చారు. అనంతరం ప్రమాణస్వీకారోత్సవం పండుగ వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమంల వందలాదిగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ... నూతన మార్కెట్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాప్తాడు నియోజకవర్గంలో విస్తృతంగా పంట సాగు ఉందని.. అయితే ఎంత ఖర్చు పెట్టి పంటలు సాగు చేసినా సరైన గిట్టుబాటు లేక రైతులు నష్టపోతుంటారన్నారు. ఇలాంటి సమయంలో మార్కెట్ యార్డ్ కమిటీ సభ్యులు చొరవ తీసుకుని రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. మార్కెట్ యార్డ్ కార్యాలయంలో కూర్చుని ఉండకుండా నిరంతరం హార్టీకల్చర్, వ్యవసాయశాఖ అధికారులను సమన్వయం చేసుకుని గ్రామాల్లో పర్యటించాలన్నారు. ఏప్రాంతంలో ఎక్కువగా ఏ పంట సాగు చేస్తున్నారో అక్కడ దిగుబడులు ఇతర ప్రాంతాలకు ఎలా తరలించాలన్నది సూచనలు, సలహాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల ముందు జగన్ని గద్దె దించేందుకు ఏ విధంగా పోరాటం చేశారో.. ఇప్పుడు రైతుల కోసం అదే తరహాలోనే పని చేయాలన్నారు. గతంలో ఉన్న వారు సరిగా పని చేయలేదు కాబట్టే మీకు ఇప్పుడు అవకాశం వచ్చిందన్నారు. మీకు ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారం ఎప్పటికీ ఉంటుందని.. రైతుల కోసం పని చేయాలని శ్రీరాం సూచించారు. మరోవైపు పరిటాల సునీత మాట్లాడుతూ... పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఇప్పుడు మార్కెట్ యార్డ్ కమిటీలో స్థానం దక్కిన ప్రతి ఒక్కరూ ఆ పదవులకు వన్నె తెచ్చే విధంగా పని చేయాలన్నారు. గతంలో ఎక్కువ మంది పోటీ ఉండటం వలన చివరి వరకు కమిటీ ఏర్పాటు కాలేదని.. చివర్లో పదవులు ఇచ్చినా.. సమయం తక్కువగా ఉండటం వలన సరిగా పని చేయలేకపోయారన్నారు. ఇప్పుడు మీకు నాలుగేళ్ల సమయం ఉంటుందని.. కచ్చితంగా రైతులకు ఉపయోగపడే విధంగా పని చేయాలన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో విస్తృతంగా పంటలు సాగు ఉన్న నేపథ్యంలో ప్రత్యేకంగా మార్కెట్ యార్డ్ అవసరం అన్నారు. గొందిరెడ్డిపల్లి 30ఎకరాల స్థలం ఉందని.. ఇప్పటికే కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లామన్నారు. కచ్చితంగా త్వరలోనే మార్కెట్ యార్డు వస్తుందని..అప్పటి వరకు రాప్తాడులో కార్యాలయం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నూతన కమిటీ సభ్యులంతా నిరంతరం రైతులు పండిస్తున్న పంటలను పరిశీలించాలని.. వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు వచ్చేలా చూడాలన్నారు. ఒక రైతుకు ఒక పంటలో బాగా లాభం వస్తే.. మిగిలిన వారు కూడా ఒకే సమయంలో ఒకే రకమైన పంటలు వేయడం వలన గిట్టుబాటు ధరలు ఉండటం లేదన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులకు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని సలహాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహించి.. రైతులకు ఏం కావాలన్నది తమ దృష్టికి తీసుకొస్తే.. కచ్చితంగా వాటిని ఎంపీ సాయంతో ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. గతంలో ఫ్యాక్షన్ ప్రాంతంగా ఉన్న రాప్తాడుకు ఓ వైపు హంద్రీనీవా, మరోవైపు పీఏబీఆర్ నీరు తీసుకొచ్చి రైతులు పంటలు పండించుకునే విధంగా చేశామన్నారు. ఇప్పుడు రాప్తాడు వ్యవసాయంలో అగ్రగామిగా ఉందని రానున్న రోజుల్లో ఇంకా అభివృద్ధి పనులు చేయాల్సి ఉందని.. పరిటాల అనే బ్రాండ్ గుర్తుండేలా పనులు ఉంటాయని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు. మరోవైపు ప్రమాణస్వీకారం అనంతరం చైర్మన్ సుధాకర్ చౌదరి మాట్లాడుతూ... పరిటాల కుటుంబాన్ని తన జీవితంలో మర్చిపోనని... రైతుల కోసం శక్తివంచన లేకుండా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తామన్నారు.

# విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం ఎంతో ముఖ్యం : ఎంపీ బస్తిపాటి



కర్నూలు (చైతన్యరథం): నగరంలోని ఎన్.ఆర్ పేటలోని శ్రీలక్ష్మి పాఠశాలలోని పినాక ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న ఉచిత శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సాధించాలన్న తపన మనలో ఉంటే ఏదైనా సాధించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరికి ఆత్మ విశ్వాసం చాలా ముఖ్యమన్నారు. తనకే ఎంపీ టికెట్ వస్తుందని ఆత్మ విశ్వాసంతో నమ్మి టికెట్ కోసం ప్రయత్నించానన్నారు. ఎంపీ టికెట్ సాధించడంతో పాటు ఎంపీగా గెలుపొందానన్నారు. విద్యార్థులు కూడా ఎక్కడా ఆత్మ విశ్వాసం కోల్పోకుండా అన్ని రంగాల్లో మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఎం.ఆర్.ఓ.ఆంజనేయులు, శ్రీలక్ష్మి స్కూల్ డైరెక్టర్ దీక్షిత్, ప్రజా పరిరక్షణ సమితి నాయకులు లాయర్ బలరాం, పినాక కోర్స్ డైరెక్టర్ రవికుమార్, కురువ సంఘం నాయకులు సుంకన్న, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు ఇంటి వద్దకే బియ్యం అందించిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

శింగనమల (చైతన్యరథం): యల్లనూరు మరియు పుట్లూరు మండల కేంద్రాలలోని ప్రభుత్వ చౌక ధాన్యపు డిపోల ద్వారా వృద్ధులకు బియ్యం సరుకులను ఇంటి వద్దకే నియోజవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ బియ్యం కావాలంటే ఉపాధి కూలి పనులు మాని, బియ్యం కోసం ఎదురుచూసే పరిస్థితి ఉండేది. ఎక్కడో దూరంగా ఊరి చివర యం.డి.యూ. వాహనాలు నిలబెట్టి, కేవలం ఒక్కపూట మాత్రమే బియ్యం ఇచ్చేవారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారం వచ్చిన తర్వాత ఎం.డి.యు. వాహనాల ద్వారా రేషన్ ఇచ్చే విధానాన్ని రద్దు చేసి, చౌక ధాన్యపు డిపోల ద్వారా నెలలో 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు బియ్యం సరుకులు పొందేందుకు విధంగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.



# కుట్రలతో కశ్మీర్‌లో అభివృద్ధిని అడ్డుకోలేరు

## పాకిస్థాన్‌కు ప్రధాని మోదీ హెచ్చరిక - అత్యంత ఎత్తయిన రైల్వే ఆర్చి బ్రిడ్జి చీనాబ్ వంతెన ప్రారంభించిన ప్రధాని

శ్రీనగర్: జమ్మూకాశ్మీర్‌లో శాంతి, పురోగతిని అడ్డుకునేందుకు పాకిస్థాన్ నిరంతరం ప్రయత్నిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. చీనాబ్ వంతెన ప్రారంభోత్సవం జమ్మూకశ్మీర్ పురోగతికి ప్రతిబింబమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా.. కాశ్మీర్లో అభివృద్ధిని ఆపలేరన్నారు. పహల్గామ్‌లో దాడి కేవలం పౌరులపై జరిగింది మాత్రమే కాదన్నారు. ఈ దాడి భారతదేశంలో అల్లర్లు రెచ్చగొట్టి, శాంతిని అస్థిరపరచాలనే లక్ష్యంతో జరిగిన వ్యూహాత్మక చర్య అని మోదీ వ్యాఖ్యానించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత తొలిసారి శుక్రవారం కశ్మీర్ లోయలో పర్యటించిన ప్రధాని.. ప్రపంచంలోనే ఎత్తయిన రైల్వే ఆర్చి బ్రిడ్జి అయిన చినాబ్ ఉక్కు వంతెనను ప్రారంభించారు. అలాగే కట్రాలో రూ.46వేల కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులను ఆవిష్కరించారు. కట్రా-శ్రీనగర్ మధ్య రైలుకు ఆయన జెండా ఊపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్ గురించి ప్రస్తావించారు. ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పామని పునరుద్ఘాటించారు. మన పొరుగు దేశం పర్యాటకానికి, మానవత్వానికి వ్యతిరేకం. మన పర్యాటకాన్ని దెబ్బతీసి పేదల పొట్టగొట్టాలని చూస్తోంది. ఆదిల్ హుస్సేన్ గుర్రం మీద పర్యాటకులను తీసుకెళ్లే పోనీవాలా, తన కుటుంబాన్ని పోషించేందుకు కష్టపడే అతడు.. పహల్గాం ఉగ్రదాడి జరిగిన రోజు ఉగ్రవాదులతో వీరోచితంగా పోరాడాడు. అతడినీ ఉగ్రవాదులు పొట్టనబెట్టుకున్నారు. ఉగ్రవాదంపై పోరాటంలో వెనక్కి తగ్గేది లేదు. పాక్ కుయుక్తులను భారత్ ఎప్పటికప్పుడు ఎండగడుతూనే ఉంది. ఉగ్ర కుట్రలకు దీటుగా బదులిస్తున్నాం. కశ్మీర్లో పర్యాటకాన్ని ధ్వంసం చేయాలని, దేశంలో అల్లర్లు సృష్టించాలనే కుట్రతోనే పహల్గాంలో ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. అమాయక ప్రజల ప్రాణాలు పొట్టనబెట్టుకున్నారు. దానికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్లో మన శక్తి ఏంటో చూపించాం. పొరుగు దేశంలోని ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేశాం. పాక్ నాయకత్వానికి నిద్ర లేకుండా చేశాం. ఎన్ని కుట్రలు పన్నినా కశ్మీర్ అభివృద్ధిని అడ్డుకోలేరని మోదీ పునరుద్ఘాటించారు.

**8వ తరగతిలో ఆ సీఎం కల.. మేం నేరవేర్చాం..**

ఈఫిల్ టవర్ కన్నా ఎత్తైన వంతెనను నిర్మించుకున్నాం. భారత ఇంజనీరింగ్ నైపుణ్యానికి చీనాబ్ బ్రిడ్జ్ ఓ ప్రతీక. ఈ వంతెన



నిర్మాణంతో ఈ ప్రాంతం పర్యాటక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ బ్రిడ్జ్ నిర్మాణంలో ఎన్నో సవాళ్లు ఎదురైనా.. మాతా వైష్ణోదేవి ఆశీర్వాదంతో ఇది సాధ్యమైంది. ఈ రోజుతో భారత రైల్వే నెట్వర్క్‌తో కాశ్మీర్ కూడా అనుసంధానమైంది. ఇక కశ్మీర్ నుంచి కన్యాకుమారి అనేది వాస్తవ రూపంలోకి వచ్చినట్లయ్యింది. ఈ రోజు కోసం అనేక తరాలు ఎదురుచూశాయి. సీఎం ఒమర్ అబ్దుల్లా కూడా 8వ తరగతి నుంచే ఈ ప్రాజెక్ట్ కోసం కలలు కన్నారు. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం దాన్ని నెరవేర్చిందని ప్రధాని మోదీ తెలిపారు.

**వందే భారత్ కూడా..**

చీనాబ్ వంతెనను పరిశీలించిన ప్రధాని మోదీ దాన్ని నిర్మించిన కార్మికులతో మాట్లాడారు. ఆ తర్వాత, అదే ట్రాక్‌పై దేశంలోనే మొట్టమొదటిసారిగా తీగలతో అనుసంధానించిన అంజీ రైల్వే వంతెన (కేబుల్ బ్రిడ్జి)ను కూడా ప్రారంభించారు. ఈ చారిత్రాత్మక వంతెన కాశ్మీర్ లోయను మొత్తం భారతదేశంతో అనుసంధానించడమే కాకుండా, ఈ ప్రాంతంలో వాణిజ్యం, పర్యాటకం, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తుంది. దీంతోపాటు కాట్రా, శ్రీనగర్‌లను కలిపే వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను కూడా ప్రధానమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలు ద్వారా జమ్మూ నుంచి శ్రీనగర్‌కు ప్రయాణం 3 గంటలు తగ్గనుంది.

**రైతులకు కూడా..**

చీనాబ్, అంజీ వంతెనలను భారతదేశ ఇంజనీరింగ్ శక్తి, ఆకాంక్షల సంకేతంగా ప్రధాని మోదీ అభివర్ణించారు. ఈ వంతెనలు ఈఫిల్ టవర్ కంటే ఎత్తైనవని, పీర్ పంజాల్ కొండల సవాళ్లను అధిగమించి నిర్మించారని పేర్కొన్నారు. ఈ వంతెనలు కేవలం ఇంజనీరింగ్ అద్భుతాలు మాత్రమే కాదని, కాశ్మీర్ ఆర్థిక వృద్ధికి కొత్త శకాన్ని తీసుకొస్తాయని మోదీ వెల్లడించారు. ఈ వంతెనల ద్వారా కాశ్మీర్ ఆపిల్స్ జాతీయ మార్కెట్‌కు తక్కువ ఖర్చుతో, సమయానికి చేరుకుంటాయన్నారు. దీనివల్ల స్థానిక రైతులకూ లాభం చేకూరుతుందని ప్రధాని మోదీ చెప్పారు.

**శతాబ్దపు కల సాకారం**

చీనాబ్ వంతెన ప్రారంభంతో శతాబ్దపు కల సాకారమైంది. కట్ నుంచి కశ్మీర్కు వందేభారత్ రైలుకు జెండా ఊపడం ద్వారా ఆ వంతెన అందుబాటులోకి వచ్చింది. అత్యంత దుర్లభమైన శివాలిక్, పీర్ పంజాల్ పర్వత శ్రేణులను కలుపుతూ కశ్మీర్ లోయకు రైలును నడపాలన్న బ్రిటీష్ కాలం నాటి ప్రణాళిక ఇప్పటికి కార్యరూపం దాల్చింది. రైలు మార్గం ద్వారా కశ్మీర్‌ను భారత్లోని మిగతా ప్రాంతాలతో అనుసంధానించేందుకు చేపట్టిన ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్వే ప్రాజెక్టులో ఈ వంతెన భాగం. చినాబ్ నదీ గర్భం నుంచి 359 మీటర్ల ఎత్తులో దీన్ని నిర్మించారు. దీని పొడవు 1315 మీటర్లు. ఇప్పటివరకు చైనాలోని బెయిషాన్ నదిపై ఉన్న షుబాయ్ రైల్వే వంతెన (275 మీటర్లు ఎత్తు) పేరుతో ఉన్న ప్రపంచ రికార్డును ఇది అధిగమించింది. ఢిల్లీలోని కుతుబ్ మినార్ కంటే 5 రెట్ల ఎత్తు ఉంటుంది. పారిస్‌లోని ప్రఖ్యాత ఐఫిల్ టవర్‌తో పోలిస్తే దీని ఎత్తు 30 మీటర్లు ఎక్కువ కావడం విశేషం. అతివేగం, భూకంపాలు, వరదలు, బాంబు పేలుళ్లను సైతం తట్టుకునేలా అత్యాధునిక సాంకేతికతతో దీనిని నిర్మించారు. గంటకు 266 కి.మీ వేగంతో గాలులు వీచినా వంతెన చెక్కుచెదరదు.దీని ప్రారంభంతో జమ్మూ నుంచి శ్రీనగర్‌కు ప్రయాణ సమయం కూడా తగ్గుతుంది. ఈ వంతెన జీవితకాలం దాదాపు 120 ఏళ్లు అని ఇంజినీర్లు చెప్తున్నారు. దీనిపై గరిష్టంగా 100కి.మీ. వేగంతో రైలు వెళ్లే అవకాశం ఉంది. 1.31 కి.మీ. మేర విస్తరించిన దీని నిర్మాణానికి కేంద్రం సుమారు రూ.1,486 కోట్లు ఖర్చు చేసింది. అలాగే 28వేల టన్నుల ఉక్కును వినియోగించినట్లు తెలుస్తోంది. 2002లో అటల్ బిహారీ వాజ్‌పేయీ హయాంలో ఈ ప్రాజెక్టు రూపకల్పన చేశారు. అంటే ఇప్పుడు 23 ఏళ్ల తర్వాత ఇది పూర్తయింది.

# ఆగస్టు 3న నీట్ పీజీ పరీక్ష

న్యూఢిల్లీ: నీట్ పీజీ-2025 ప్రవేశ పరీక్షను ఆగస్టు 3న నిర్వహించేందుకు సుప్రీంకోర్టు శుక్రవారం అనుమతి ఇచ్చింది. నేషనల్ ఎగ్జామినేషన్ బోర్డ్ (ఎన్ఈబీ) ఈ కొత్త తేదీని ప్రతిపాదించగా.. అత్యున్నత న్యాయస్థానం అంగీకరించింది. ఒకే షిఫ్ట్‌లో పరీక్షను జరపాలని ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్ఈబీ అభ్యర్థన మేరకు పరీక్ష నిర్వహణ తేదీని జూన్ 15 నుంచి మార్చుకునేందుకు వీలు కల్పించింది.




వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే జాతీయస్థాయి అర్హత పరీక్ష (నీట్)కు సంబంధించి ఇటీవల సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. పరీక్షను రెండు షిఫ్టుల్లో నిర్వహించడానికి నిరాకరించింది. దానివల్ల కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొంది. పరీక్ష నిర్వహణలో పూర్తి పారదర్శకతను పాటించాలని, సురక్షితమైన పరీక్షా కేంద్రాలనే ఎంచుకోవాలని సూచించింది. రెండు ప్రశ్నపత్రాలు ఎప్పటికీ ఒకేవిధమైన కాఠిన్య లేదా సులభ స్థాయిని కలిగిఉండవని అభిప్రాయపడింది. పోటీ తీవ్రత దృష్ట్యా ర్యాంకు నిర్ధారణలో ప్రతి మార్కూ అత్యంత కీలకమేనని తెలిపింది. నార్మలైజే షన్ విధానాన్ని కొన్ని ప్రత్యేక కేసుల్లో మాత్రమే అనుసరించాలని, ప్రతి ఏడాదీ నిర్వహించుకొనే పరీక్షకు అది సరికాదని ధర్మాసనం పేర్కొంది.

నీట్-పీజీ 2025, రెండు షిఫ్ట్‌ల్లో నిర్వహిస్తారంటూ వెలువడిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణలో భాగంగా సుప్రీం కోర్టు ధర్మాసనం ఈ ఉత్తర్వులిచ్చిన సంగతి తెలిసిందే. ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చినందున దేశమంతటికీ ఒకే షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహించడం కష్టం కాబోదని చెబుతూ అధికారుల అభ్యంతరాలను తోసిపుచ్చింది.. పరీక్ష నిర్వహణకు ఇంకా రెండు వారాలకు పైగా సమయం ఉన్నందున సురక్షితమైన పరీక్షా కేంద్రాల ఎంపిక కష్టమేమీ కాదని స్పష్టంచేసింది. ఏర్పాట్లకు సమయం సరిపోదని అధికారులు భావిస్తే పరీక్ష తేదీని పొడిగించుకొనే స్వేచ్ఛనిస్తామని పేర్కొంది. ఈ నేపథ్యంలోనే తేదీ మార్పు చోటుచేసుకుంది.

# కస్టమర్ల సొమ్ముతో స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులు

## - రూ.4.58 కోట్లు అక్రమంగా వాడుకున్న అధికారిణి అరెస్ట్

జైపూర్: కస్టమర్ల ఫిక్స్‌డ్ డిపాజిట్ సొమ్మును వారికి తెలియకుండా స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టేందుకు తరలించిన బ్యాంకు ఉద్యోగినిని పోలీసులు అరెస్ట్ చేశారు. రాజస్థాన్‌లోని జైపూర్ ఐసీఐసీఐ బ్యాంక్‌లో కస్టమర్లు ఫిక్స్ డ్ డిపాజిట్ చేసిన డబ్బును ఓ అధికారిణి స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడిగా పెట్టేందుకు వాడుకుంది. భారీ నష్టాలు రావడంతో వాటిని తిరిగి జమ చేయలేకపోయింది. విషయం బయటపడటంతో పోలీసులు ఆమెను అరెస్టు చేశారు.

అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సాక్షి గుప్తా ఐసీఐసీఐ బ్యాంక్ రిలేషన్షిప్ మేనేజర్‌గా పనిచేస్తోంది. ఈక్రమంలో బ్యాంక్లో పలువురి ఫిక్స్‌డ్ డిపాజిట్ల డబ్బును దుర్వినియోగం చేసింది. 40 మందికి పైగా కస్టమర్లకు చెందిన రూ.4.58 కోట్లను అక్రమంగా వాడుకుంది. స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆ సొమ్మును ఉపయోగించింది. అయితే, అందులో ఆమెకు భారీగా నష్టాలు రావడంతో ఆ డబ్బును తిరిగి జమ చేయలేకపోయింది. ఓ వ్యక్తి తన ఫిక్స్‌డ్ డిపాజిట్ గురించి తెలుసుకునేందుకు బ్యాంక్‌కు రాగా ఈ స్కామ్ విషయం బట్టబయలైంది. దీంతో బ్యాంకు అధికారులు ఆమెపై కేసు నమోదు చేశారు.

గురువారం రాత్రి సాక్షి తన సోదరి వివాహ వేడుకలో ఉండగా.. పోలీసులు వెళ్లి ఆమెను అరెస్టు చేశారు. కస్టమర్ల ఖాతాలకు ఆమె కుటుంబసభ్యుల నంబర్లను జత చేసినట్లు విచారణలో వెల్లడైంది. దీనిద్వారా డబ్బులు డ్రా చేసిన విషయం వారికి తెలియలేదు.

ఈ స్కాంకు సంబంధించి బ్యాంకు ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. అయితే, కస్టమర్ల డబ్బును తిరిగి అందిస్తామని ఆ బ్యాంక్ లోని పలువురు అధికారులు తెలిపారు.

# రాజ్యసభకు కమల్ నామినేషన్



చెన్నై: ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధినేత కమల్ హాసన్ రాజ్యసభకు శుక్రవారంనాడు నామినేషన్ వేశారు. తమిళనాడు సెక్రటేరియట్‌లో ఆయన తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్ కార్యక్రమానికి తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ హాజరయ్యారు. భాగస్వామ్య పార్టీల నేతలు వీసీకే చీఫ్ తిరుమావలన్, ఎండీఎంకే చీఫ్ వైగో, తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు సెల్వపెరుంతగై సైతం పాల్గొన్నారు. డీఎంకే ఒక రాజ్యసభ సీటును ఎంఎన్ఎంకు కేటాయిస్తూ కమల్‌హాసన్ పేరును ఇటీవల ప్రకటించింది. తమిళనాడు అసెంబ్లీలో 234 మంది సభ్యులుండగా, రాజ్యసభ అభ్యర్థుల గెలుపునకు ఒక్కొక్కరికి 34 ఓట్లు అవసరమవుతాయి. 158 ఎమ్మెల్యేల బలం డీఎంకే కూటమికి ఉంది. డీఎంకేకు సొంతంగా 133 ఎమ్మెల్యేల బలం ఉండగా, భాగస్వామ్య పార్టీలైన కాంగ్రెస్‌కు 17, వీసీకేకు 4, సీపీఐ, సీపీఎంలకు చెరో నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. సంఖ్యా బలం ప్రకారం 4 రాజ్యసభ సీట్లను డీఎంకే సునాయాసంగా గెలుచుకుటుంది. కమల్ కాకుండా మరో ముగ్గురు అభ్యర్థులను డీఎంకే నిలబెట్టింది. జూన్ 19 రాజ్యసభకు ఎన్నికలు జరగనున్నాయి. కమల్‌హాసన్ 2018లో మదురై జరిగిన ఒక కార్యక్రమంలో మక్కల్ నీది మయ్యం పార్టీని ప్రారంభించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ పోటీ చేయకుండా, డీఎంకే సారథ్యంలోని 'ఇండియా' కూటమికి ప్రచారం చేసింది. 2021 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి 2.62 శాతం ఓట్లు పడ్డాయి.

# ‘సింధూ’ను పునస్సమీక్షించండి

## భారత్‌కు పాక్ మూడో లేఖ



సింధూ జలాల ఒప్పందం నిలిపివేతతో పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఆ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కోరుతూ భారత్‌కు ఇప్పటివరకు నాలుగు లేఖలు రాసింది. ఒక లేఖను మేనెల ప్రారంభంలో రాయగా.. మిగతా మూడింటిని ‘ఆపరేషన్ సిందూర్ తర్వాత రాసిందని సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ పలు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. భారత జలశక్తి మంత్రిత్వ శాఖకు పాక్ జలవనరుల శాఖ నుంచి ఈ లేఖలు వచ్చినట్టు తెలుస్తోంది. సింధూ జలాలు నిలిపివేస్తే పాక్‌లో తీవ్ర దుర్భిక్షం నెలకొంటుందంటూ ఓ లేఖలో పాక్ పేర్కొన్నట్టు గతంలో మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ విషయంలో చర్చించేందుకు పాక్ సిద్ధంగా ఉందని వాటి సారాంశం. ప్రోటోకాల్‌లో భాగంగా ఈ అంశాన్ని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు పంపినట్టు తెలుస్తోంది. అయితే, రక్తం, నీరు రెండూ కలిసి ప్రవహించలేవంటూ.. ఈ విషయంలో వెనక్కి తగ్గేది లేదని ప్రధాని మోదీ ఇప్పటికే పలుమార్లు స్పష్టంచేశారు. పాక్ చర్చలంటూ జరిగితే ఉగ్రవాదం, పాక్ ఆక్రమిత కశ్మీర్‌పైనేనని పేర్కొన్న సంగతి విధితమే.

**ఏమిటీ ఒప్పందం..?**

ఏప్రిల్లో పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన తర్వాత నుంచి భారత్-పాక్ సంబంధాలు పూర్తిగా క్షీణించాయి. భారత్ సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేసిన తెలిసిందే. సింధూ, దాని ఉపనదుల జలాలను పంచుకోవడానికి వరల్డ్ బ్యాంకు మధ్యవర్తిత్వంలో భారత్, పాకిస్థాన్ మధ్య ఒప్పందం 1960లో కుదిరింది. ఈ ఒప్పందంపై నాటి భారత ప్రధాని నెహ్రూ, పాకిస్థాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ సంతకాలు చేశారు. ఈ డీల్ ప్రకారం సింధూ ఉప నదుల్లో తూర్పున ప్రవహించే రావి, బియాస్, సట్లెజ్ నదులపై భారత్‌కు హక్కులు లభించాయి. సింధూ నదితోపాటు దాని పశ్చిమ ఉపనదులైన జీలం, చీనాబ్‌లపై పాకిస్థాన్‌కు హక్కులు దక్కాయి. ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పేందుకు భారత ప్రభుత్వం సింధూ నదీ జలాల ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

# ‘సిమ్లా’పై ఏ నిర్ణయం తీసుకోలేదు

## పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసీఫ్ వివరణ




భారత్‌తో 1972లో జరిగిన సిమ్లా ఒప్పందం నుంచి వైదొలగే అంశంపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని పాకిస్థాన్ విదేశాంగ శాఖ వివరణ ఇచ్చింది. ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసీఫ్ మాట్లాడుతూ సిమ్లా ఒప్పందానికి ఇక విలువలేదు.. అదొక డెడ్ డాక్యుమెంట్ అని వ్యాఖ్యానించారు. సింధూజలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేశారో లేదో తెలియదుగానీ.. సిమ్లా అగ్రిమెంట్ పనైపోయిందని పేర్కొన్నారు. దీంతో తాము 1948నాటి స్థితికి చేరుకొన్నామని పేర్కొన్నారు. ప్రస్తుతమున్న నియంత్రణ రేఖ కాస్తా కేవలం కాల్పుల విరమణ రేఖగా భావిస్తామన్నది ఆయన ఉద్దేశం. 1948 భారత్-పాక్ యుద్ధం తర్వాత దీనిని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో విదేశాంగశాఖ ప్రతినిధి వివరణ ఇస్తూ “భారత్‌తో ఏ ద్వైపాక్షిక ఒప్పందాన్ని రద్దు చేసుకోవడానికి అధికారికంగా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ప్రస్తుతం ఆ దేశంతో ఉన్న సిమ్లా ఒప్పందంతో సహా అన్ని ద్వైపాక్షిక ఒప్పందాలు అమల్లో ఉంటాయి” అని ఆ దేశానికి చెందిన ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్‌కు వెల్లడించారు. 1971లో భారత్-పాక్ యుద్ధం తర్వాత ఈ ఒప్పందం చేసుకొన్నారు. దీని ప్రకారం భారత్- పాక్ సంబంధాల నిర్వహణకు సంబంధించిన చర్యలు తీసుకొంటారు.

ఈ ఒప్పందం ద్వారా శాంతియుత ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించుకోవాలని, పెండింగ్‌లోవున్న సమస్యలను పరిష్కరించుకోవాలని రెండు దేశాలు తీర్మానించాయి. ఇందులో కశ్మీర్ అంశమూ ఉంది. ఈ ఒప్పందంపై అప్పటి భారత ప్రధాని ఇందిరాగాంధీ, పాక్ అధ్యక్షుడు జుల్ఫికర్ అలీ భుట్టో సంతకాలు చేశారు. దీని ప్రకారం ఇరుదేశాలు మూడో దేశం జోక్యం లేకుండా ద్వైపాక్షిక చర్చల ద్వారా వివాదాలను పరిష్కరించుకోవాలి. జమ్మూ కశ్మీర్‌లో కాల్పుల విరమణ లైన్‌గా నియంత్రణ రేఖను పునర్నిర్వచించడం, దానిని మార్చకూడదన్న నిర్ణయానికి రెండు దేశాలు కట్టుబడటం, బంగ్లాదేశ్ సార్వభౌమత్వాన్ని గుర్తించడంతోపాటు ఆ దేశంతో సంబంధాలను సాధారణ స్థితికి తేవడానికి పాకిస్థాన్ కట్టుబడటం వంటి అంశాలున్నాయి.

ఏప్రిల్‌లో పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన తర్వాత నుంచి భారత్-పాక్ సంబంధాలు పూర్తిగా క్షీణించాయి. భారత్ సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. ఆ తర్వాత మే 7న పాకిస్థాన్, పీవోకేలోని 9 ఉగ్రస్థావరాలపై దాడులు చేసింది. ఆ తర్వాత మే 8, 9, 10 తేదీల్లో పాక్ సైన్యం భారత మిలిటరీ బేస్‌లపై దాడికి యత్నించగా.. మన దళాలు తిప్పికొట్టాయి. ఆ తర్వాత పాక్ అభ్యర్థన మేరకు భారత్ ఆపరేషన్ సిందూర్‌కు తాత్కాలిక విరామం ప్రకటించిన విషయం తెలిసిందే.

# విఫలమైన జపాన్ మూన్ మిషన్

*- ల్యాండర్‌తో తెగిపోయిన కమ్యూనికేషన్*



జపాన్‌కు చెందిన ఓ ప్రైవేటు కంపెనీ చేపట్టిన జాబిల్లి యాత్ర విఫలమైంది. చంద్రుడిపై తొలిసారి అడుగుపెట్టేందుకు ప్రైవేట్ అంతరిక్ష సంస్థ ‘ఐస్పేస్’ మూన్ మిషన్‌ను ప్రయోగించింది. అయితే, జాబిల్లిపై దిగే సమయంలో ‘రెసిలెన్స్’ ల్యాండర్‌తో సంబంధాలు తెగిపోవడంతో ప్రయోగం విఫలమైంది. జూన్ 6, 2025 ఉదయం 8:00 గంటలకు ల్యాండర్‌తో కమ్యూనికేషన్ ఆగిపోయినట్లు ఐస్పేస్ మిషన్ కంట్రోలర్లు వెల్లడించారు. వాటిని తిరిగి పునరుద్ధరించడం అసంభవమని.. దీంతో మిషన్‌ను ముగించామని పేర్కొన్నారు. దీనికి గల కారణం ఏంటనే విషయాన్ని తెలుసుకోవడం కోసం ప్రయత్నిస్తున్నట్టు సంస్థ వ్యవస్థాపకుడు తకేషి హకమ్మ తెలిపారు. రెసిలెన్స్ ల్యాండర్‌ను ఈ ఏడాది జనవరిలో స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్‌నుంచి ప్రయోగించారు. దాదాపు ఐదు నెలలపాటు ప్రయాణించిన ఈ వ్యోమనౌక మేలో చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశించింది. ప్రణాళిక ప్రకారం ఈ ల్యాండర్ జాబిల్లి ఉపరితలంపై ఉన్న ‘మేర్ ఫ్రిగోరిస్’ అనే పాయింట్ వద్ద సాఫ్ట్ ల్యాండ్ అవ్వాలి. అయితే రెసిలెన్స్ కక్ష్యనుంచి విడిపోయి గమ్యస్థానానికి వెళ్లిన తర్వాత మిషన్ కంట్రోలర్లు ల్యాండర్‌తో కమ్యూనికేషన్‌ను కోల్పోయారు. కాగా.. ఐస్పేస్ జాబిల్లి యాత్రకు యత్నించడం ఇది రెండోసారి. 2023లోనూ ల్యాండర్‌ను పంపించగా.. అది విఫలమైంది. ఇక, జాబిల్లిని చేరుకున్న అయిదో దేశంగా జపాన్ ఇప్పటికే గుర్తింపు పొందిన సంగతి తెలిసిందే. గతేడాది జపాన్ ప్రయోగించిన ‘స్లిమ్’ అనే ల్యాండర్ చంద్రుడిపై సురక్షితంగా దిగింది.

# పొసగని మిత్ర‘బేరం!

- ‘అందమైన’ బిల్లే అంతుచూసింది
- కత్తులు దూస్తున్న ట్రంప్, మస్క్‌లు



అమెరికా ఎన్నికలకు ముందు ఒక డీల్‌తో జతకట్టిన డొనాల్డ్ ట్రంప్, ఎలాన్ మస్క్.. పొరపొచ్చాలతో విడిపోయినట్టు అంతర్జాతీయ మీడియా కథనాల మీద కథనాలు వండుతోంది. రాజకీయాల్లో శాశ్వత మిత్రులు.. శత్రువులు ఉండరు.. కేవలం శాశ్వత ప్రయోజనాలే ఉంటాయన్న దానికి ట్రంప్-మస్క్‌లు ప్రత్యక్ష ఉదాహరణగా మీడియా అభివర్ణిస్తోంది. డెమోక్రాట్లను ఓడించే క్రమంలో ఇద్దరూ కలిసి ఉత్సాహంగా పనిచేశారు. తర్వాత ట్రంప్ కార్యవర్గంలో మస్క్ కీలకపాత్ర పోషించాడు. తన పదవీకాలం ముగిసి బయటకు వచ్చి పది రోజులు కూడా కాలేదు. వన్ బిగ్ బ్యూటీఫుల్ బిల్‌ను తప్పు పడుతూ ట్రంప్‌పై నిప్పులు చెరిగాడు. మరోవైపు ప్రభుత్వంనుంచి మస్క్ బయటకు వెళ్లగానే.. అతడి మిత్రుడిని కూడా కీలకమైన నాసా పదవి నుంచి ట్రంప్ ఉపసంహరించారు. దీంతో మస్క్‌కు చిర్రెత్తుకొచ్చి జెఫ్రీ ఎప్‌స్టైన్ సెక్స్ కుంభకోణంలో ట్రంప్ పేరుందని బాంబు పేల్చాడు. ప్రభుత్వం కావాలనే దాస్తోందని ఆరోపించాడు. ఈ ప్రకటనతో ట్రంప్ భగ్గుమన్నారు. మస్క్ వ్యాపారాలకు ఇచ్చే రాయితీల్లో కోత పెడతానని హెచ్చరించాడు.

**మస్క్ ఎక్కడ హర్ట్ అయ్యాడు..**

మస్క్ డిపార్ట్మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ (డోజ్)లో ఉండగానే.. ట్రంప్ సన్నిహితులతో గొడవపడ్డట్టు వార్తలొచ్చాయి. నాడు అధ్యక్షుడు ఇరుపక్షాలను సముదాయించాడు. డోజ్‌కు తక్కువ సమయం కేటాయిస్తానని మస్క్ ప్రకటించాడు. అప్పటికే ఆయన పాత్రకు ట్రంప్ కార్యవర్గం కత్తెరేసిందని ప్రచారం జరిగింది. ఇక మేలో వచ్చిన ట్యాక్స్ బిల్లు (వన్ బిగ్ బ్యూటీఫుల్ బిల్లు యాక్ట్) మస్క్‌కు అసలు ఇష్టం లేదు. దీనివల్ల ఖర్చులు విపరీతంగా పెరిగి.. డోజ్ శ్రమ బూడిదలో పోసిన పన్నీరవుతుందన్నాడు.

**ఆ అందమైన బిల్లులో ఏముందో..!**

ట్యాక్స్ బిల్లు (వన్ బిగ్ బ్యూటీఫుల్ బిల్లు యాక్ట్)లోని కొన్ని అంశాలు మస్క్ వ్యాపార ప్రయోజనాలను దెబ్బతీసేవిగా ఉన్నాయి. విద్యుత్తు కార్లపై ట్యాక్స్ క్రెడిట్‌ను గణనీయంగా తగ్గించనుంది. వాస్తవానికి ఈ క్రెడిట్లు సాధించేందుకు టెస్లా దాదాపు 2.5 లక్షల డాలర్లను లాబీయింగ్ కోసం వెచ్చించింది. మస్క్ ట్యాక్స్ క్రెడిట్ కోసం తీవ్రంగా ప్రయత్నించి విఫలమయ్యాడు. డోజ్ అధిపతిగా మస్క్‌కు ప్రత్యేకమైన ప్రభుత్వోద్యోగి హోదా దక్కింది. అక్కడి చట్టం ప్రకారం 130 రోజులు మాత్రమే అది ఉంటుంది. మస్క్ మరికొంతకాలం దానిలో ఉండాలని భావించినా.. అది సాధ్యం కాదని శ్వేత సౌధం చెప్పింది. ఇక నాసా అడ్మినిస్ట్రేటర్ పదవికి మస్క్ మిత్రుడు జారెడ్ ఇస్సాక్ మన్‌ను తొలుత ట్రంప్ ప్రతిపాదించారు. కానీ, టెస్లా అధినేతతో దూరం పెరగడంతో.. ఇస్సాక్ మన్ నామినేషన్‌ను ఉపసంహరించుకొన్నాడు. ఇది మస్క్‌కు కొంత ఆగ్రహం తెప్పించింది. ఇస్సాక్ మన్ ఘటన తర్వాత శ్వేతసౌధం నుంచి ఓ విషయం బయటికొచ్చింది. గతంలో ది ఆఫీస్ ఆఫ్ ప్రెసిడెన్షియల్ పర్సనల్ విభాగం డైరెక్టర్ సెర్గీ గోర్‌తో మస్క్ గొడవపడ్డాడు. తాజాగా ఇస్సాక్ మన్ నామినేషన్ ఉపసంహరణ వెనక అతడి హస్తం ఉందని శ్వేతసౌధం సిబ్బంది. లీకులిచ్చారు. దీంతో మస్క్ అసంతృప్తి కట్టలు తెంచుకొంది. వాస్తవానికి ఇస్సాక్ మన్ డెమోక్రటిక్ పార్టీకి విరాళాలు ఇవ్వడమే అతడిపై వేటుకు కారణమైంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఏకంగా అమెరికాలో కొత్త పార్టీ పెడితే ఎలా ఉంటుందంటూ. మస్క్ ఎక్స్ పోల్ పెట్టాడు. మరోవైపు ట్రంప్ తనవల్లే గెలిచారని ప్రకటించాడు. దీనిని అమెరికా అధ్యక్షుడు తీవ్రంగా ఖండించారు. మస్క్ లేకపోయినా.. పెన్సిల్వేనియాలో గెలిచేవాడినని చెప్పుకొచ్చారు.



# థగ్‌లైఫ్ నెగెటివిటీ..

యూనివర్సల్ హీరో కమల్ హాసన్ హీరోగా లెజెండరీ దర్శకుడు మణిరత్నం తెరకెక్కించిన అవైటెడ్ చిత్రం “థగ్ లైఫ్”. అయితే ఎన్నో ఏళ్ళ తర్వాత కలిసి చేస్తున్న సినిమా కావడంతో దీనిపై మంచి అంచనాలు నెలకొన్నాయి కానీ తీరా థియేటర్స్‌లో రిలీజ్ అయ్యాక మాత్రం ఈ సినిమాకి ఊహించని రెస్పాన్స్ ఆడియెన్స్ నుంచి వచ్చింది.

అయితే ఈ సినిమాలో ఉన్న చాలానే డిజప్పాయింటింగ్ అంశాల్లో బాగా నెగిటివ్ తెచ్చుకున్న అంశం ఏదన్నా ఉంది అంటే అది హీరోయిన్ త్రిష పాత్ర అని చెప్పాలి. ఆమె రోల్ మాత్రమే కాకుండా ఆమెతో ఉన్న పలు సన్నివేశాలు పలు పాత్రల సంబంధాలు చూసి ఆడియెన్స్‌కి వెగటు కలిగింది అని నెగిటివ్ కామెంట్స్ వినిపిస్తున్నాయి. దీనితో త్రిష మాత్రం ఈ అంశంలో బలైపోయింది అని చెప్పక తప్పదు. ఇక ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించగా కమల్, మణిరత్నం, ఆర్ మహేంద్రన్‌లు నిర్మాణం వహించారు.




# అలాంటి నిర్మాతను నేనేనేమో..!

బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్ కొన్నేళ్ల విరామం తర్వాత 'సితారే జమీన్ పర్'తో తిరిగి థియేటర్లో సందడి చేయనున్నారు. ఈనెల 20న సినిమా విడుదల కానుంది. డిజిటల్ హక్కులను ఓటీటీలకి అమ్మకుండా థియేటర్ తర్వాత నేరుగా సినిమాని యూట్యూబ్‌లో పే పర్ వ్యూ ద్వారా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమిర్ తన సినిమా యూట్యూబ్ విడుదల సంగతులతో పాటు మరిన్ని ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. “సితారే జమీన్ పర్' సినిమా థియేటర్లో కాదు నేరుగా యూట్యూబ్లోనే విడుదలవుతుందనే వార్తల్లో నిజం లేదు. థియేటర్ విడుదల తర్వాతే యూట్యూబ్‌లో పే పర్ వ్యూ ద్వారా ప్రేక్షకులకు అందుబాటులోకి రానుందీ చిత్రం. ఈ విడుదల తర్వాత ఏం జరుగుతుందో నాకు కచ్చితంగా తెలియదు. నేను నిజాయతీగా ఉన్నాను. నేటి కాలంలో చాలామంది నిర్మాతలు ఓటీటీ హక్కులను అమ్మకుండా సినిమాని కనీసం మొదలుపెట్టడం లేదు. దీనికోసం నాకు చాలా ఆఫర్లు వచ్చాయి. కానీ అందరికి నో చెప్పాను. ఓటీటీ హక్కులు అమ్మడానికి నిరాకరించిన ఏకైక నిర్మాతను నేనే. దీని వల్ల నేను ఆర్థిక నష్టాన్ని ఎదుర్కోవచ్చు. కానీ ప్రజలు నా సినిమాను థియేటర్లలో చూడాలి. నేను సినిమాని నమ్ముతున్నాను. ప్రేక్షకులు నా సినిమాలను ఆదరించడం వల్లే ఈ స్థాయిలో ఉన్నాను. దీని కోసం నేను ఒక్కటే చేయాలనుకుంటున్న. తగ్గిపోతున్న థియేటర్ వ్యాపారాన్ని పునరుద్ధరించి, థియేటర్ రంగాన్ని బలోపేతం చేయాలి. అందుకోసం సినిమాని థియేటర్లో మాత్రమే విడుదల చేయాలని నిర్ణయించుకున్నా”.

“త్వరలో రాబోతున్న 'సితారే జమీన్ పర్' స్పానిష్ చిత్రం 'ఛాంపియన్స్' రీమేక్ అని నెట్టింట్లో విమర్శలు వస్తున్నాయి. కానీ నేను రీమేక్‌నే నమ్ముతాను. నా జీవితాంతం అలానే చేస్తాను. నాకు మంచి రీమేక్ వచ్చినప్పుడల్లా నేను అలాగే చేస్తాను. నేనెందుకు అలా చేయకూడదు? మీకు చూడాలనిపించకపోతే దాన్ని చూడకండి. సినిమా తీయడం నా ఇష్టం. కానీ చూడడం అనేది మీ ఇష్టం. నేను 10కిపైగా రీమేక్ చిత్రాలు తీశాను.



అందులో 'లాల్సింగ్ చద్దా' తప్ప అన్నీ సూపర్ హిట్ సినిమాలే. సినిమా బాగుంటే ట్రోలింగ్ పనిచేయదు. నేను ప్రేక్షకుల భావాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటాను. ట్రోలింగ్స్‌ని పట్టించుకోను” అన్నారు.

# వద్దన్నా.. వెంటపడ్డారు



ముంబయి ఎయిర్‌పోర్టులో తనని ఫొటోలు తీసేందుకు యత్నించిన పలువురు ఫొటోగ్రాఫర్లపై నటుడు రానా అసహనం వ్యక్తంచేసిన విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియోపై తాజాగా ఆయన క్లారిటీ ఇచ్చారు. తనకు ఇలాంటివి నచ్చవన్నార. ఇలాంటి కల్చర్ టాలీవుడ్‌లో లేదని తాజాగా ఓ మీడియాతో చెప్పారు. “ఇలాంటివి నాకు పెద్దగా నచ్చవు. నాకంటూ ఒక పర్సనల్ టైమ్ ఉంటుంది. ఆ సమయంలో ఇలాంటివి ప్రోత్సహించను. ఫొటోలు తీయమని వాళ్లను పిలవను. ఇదే విషయాన్ని పలు సందర్భాల్లో ఇప్పటికే చెప్పాను. నేను ఎన్నిసార్లు చెప్పినా వాళ్లు ఇదేవిధంగా వ్యవహరిస్తున్నారు. ఇది ఒకింత ఇబ్బందికరంగా అనిపిస్తుంది. ఇటీవల ఎయిర్‌పోర్టులో చాలామంది నా చుట్టూ చేరి ఫొటోలు తీయాలని చూశారు. వారిని తప్పించుకునే క్రమంలో నా ఫోన్‌ను చేజార్చుకున్నా. మిమ్మల్ని ఎవరైతే పిలిపించుకుంటారో వారిని ఫొటోలు తీసి కంటెంట్ క్రియేట్ చేసుకోండి. ఫొటోలపై ఆసక్తి చూపించేవారిని తీయండి తప్పులేదు” అని ఆయన వివరించారు. తెలుగు చిత్ర పరిశ్రమలో నటీనటుల వ్యక్తిగత గోప్యతకు ఫొటోగ్రాఫర్లు భంగం కలిగించరని చెప్పారు.

**అసలేం జరిగిందంటే:**

ముంబయి ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వస్తోన్న రానాను ఫొటోలు తీసేందుకు ఫొటోగ్రాఫర్లు ప్రయత్నించగా.. తనకు ఆసక్తి లేదని, ఫొటోలు తీయొద్దని ఆయన సున్నితంగా చెప్పారు. రానా నో చెప్పినప్పటికీ పలువురు ఫొటోగ్రాఫర్లు ఆయన్ని వదల్లేదు. ఫొటోలకు పోజులివ్వమని కోరుతూ ఆయన వెంటపడ్డారు. వారిని తప్పించుకుని కారు ఎక్కే క్రమంలో ఎదురుగా వస్తోన్న మహిళ ఢీకొనడంతో ఆయన ఫోన్ ఒక్కసారిగా చేయి జారి కిందపడి పోయింది. దీంతో ఆగ్రహానికి గురైన ఆయన వెంటనే వెనక్కి వెళ్లి ఫొటోగ్రాఫర్‌తో మాట్లాడారు. నో చెప్పినా ఇలా వెంటపడటం కరెక్ట్ కాదని చెప్పారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. 'రానా నాయుడు 2' ప్రమోషన్స్‌లో భాగంగా ఆయన ముంబయి వెళ్లినట్టు సమాచారం. జూన్ 13నుంచి ఇది నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది.



# సైలెంట్‌గా ఓటీటీలోకి సింగిల్

శ్రీవిష్ణు హీరోగా నటించిన సరికొత్త చిత్రం 'సింగిల్'. కేతిక శర్మ, ఇవానా కథానాయికలు. కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు. కామెడీ, రొమాంటిక్ ఎంటర్టైనర్‌గా రూపొందిన సినిమా వేసవి కానుకగా మేలో విడుదలై ప్రేక్షకులను ఆద్యంతం నవ్వించింది. ఇప్పుడీ చిత్రం సైలెంట్‌గా ఓటీటీలోకి అడుగుపెట్టింది. అమెజాన్ ప్రైమ్ వేదికగా ప్రస్తుతం ఇది స్ట్రీమింగ్ అవుతోంది. కథేంటంటే: విజయ్ (శ్రీవిష్ణు) ఎల్డీఎఫ్ బ్యాంక్‌లో ఇన్స్యూరెన్స్ విభాగంలో పని చేస్తుంటాడు. అదే బ్యాంక్‌లో పని చేసే తన మిత్రుడు అరవింద్ (వెన్నెల కిషోర్) ఓ అమ్మాయిని ప్రేమించి.. పెళ్లి చేసుకునే ప్రయత్నాల్లో ఉంటాడు. ఈ విషయంలో అరవింద్‌కు సాయం చేస్తుండగా మెట్రోలో పూర్వ (కేతిక శర్మ)ను చూసి మనసు పారేసుకుంటాడు విజయ్. ఓ కారు షోరూంలో పని చేసే ఆమెని ఎలాగైనా తన ప్రేమలో పడేయాలన్న ఆలోచనతో ఓ ప్రణాళిక రచించగా.. అది బెడిసి కొడుతుంది. ఈ క్రమంలోనే డ్యాన్సర్ హరిణి (ఇవానా) తన జీవితంలోకి వస్తుంది. ఓవైపు తనని ప్రేమించమంటూ పూర్వ చుట్టూ విజయ్ తిరుగుతుంటే.. మరోవైపు అతన్ని ప్రేమిస్తూ హరిణి.. వెంటపడుతుంటుంది. మరి ఈ ముక్కోణపు ప్రేమకథ అలా ఎన్ని మలుపులు తిరిగింది? ఆఖరికి పూర్వని విజయ్ ప్రేమలో పడేశాడా? లేక అతన్ని హరిణి ప్రేమలో పడేసిందా? లేదంటే ఊహలకు అందనివిధంగా ఇంకేమైనా జరిగిందా? అన్నది మిగిలిన కథ.

# ఇంటివాడైన అఖిల్



తన బ్యాచిలర్ లైఫ్‌కు గుడ్‌బై చెప్పేశారు నటుడు అఖిల్ అక్కినేని. శుక్రవారం తెల్లవారుజామున ఆయన వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. తన ప్రియురాలు జైనబ్ రద్దీతో ఆయన వివాహం వేడుకగా జరిగింది. హైదరాబాద్‌లోని నాగార్జున నివాసంలో జరిగిన వివాహ వేడుకకు కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితులు, చిరంజీవి కుటుంబం, రాజమౌళి తనయుడు కార్తికేయ, దర్శకుడు ప్రశాంత్‌నీల్, నటుడు శర్వానంద్‌తోపాటు పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. దీనికి సంబంధించిన పలు ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. జూన్ 8న రిసెప్షన్ జరగనుంది. అన్నపూర్ణ స్టూడియోస్‌లో జరగనున్న వివాహ విందుకు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరు కానున్నారు.

***ఎవరీ జైనబ్..***

దిల్లీకి చెందిన జైనబ్ థియేటర్ ఆర్టిస్ట్ మాత్రమే కాదు, సోషల్మీడియా ఇన్ఫ్లుయెన్సర్ కూడా. ఇండియాలోనే కాదు దుబాయ్, లండన్లోనూ ఆర్టిస్టా ఆమె రాణించారు. రెండేళ్ల క్రితం అఖిల్తో మొదలైన పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ఇరు కుటుంబాల అంగీకారంతో ఒక్కటయ్యారు. జైనబ్ తండ్రి జుల్ఫీ రద్దీ, నాగార్జున కుటుంబాల మధ్య కొన్నేళ్లుగా స్నేహబంధం ఉంది.



# పెద్ది.. నైటౌట్!

'పెద్ది'గా ప్రేక్షకుల్ని పలకరించనున్నారు రామచరణ్. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయిక. శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న సినిమా హైదరాబాద్‌లో మరో కొత్త షెడ్యూల్ ప్రారంభించుకుంది. ప్రత్యేకంగా సిద్ధం చేసిన సెట్లో పూర్తిగా రాత్రి పూట సాగే షెడ్యూల్‌లో రామ్‌చరణ్ కీలక సన్నివేశాలతోపాటు భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను తెరకెక్కించనున్నట్టు సమాచారం. ఇది క్రీడా నేపథ్య అంశాలతో ముడిపడి ఉన్న బలమైన భావోద్వేగాలతో నిండిన యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతోంది. చరణ్ ఇందులో ఆట కూలీగా రా రస్టిక్ పాత్రలో కనిపించనున్నారు. ఇది వచ్చే ఏడాది మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.